PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 69 | విజయవాడ, సోమవారం 9 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 9 October 2023 | Rs

చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం

- వచ్చే నెల 30న ప్రదానం

3

ఆట ముగిసింది.. స్ఫూర్తి నిలిచింది!

- ఆకట్టుకున్న హాంగ్జౌ ఆసియా క్రీడల ముగింపు వేడుకలు

6

హమాస్, ఇజ్రాయిల్ బలగాల మధ్య ఘర్షణతో

నెత్తురోడుతున్న గాజా

- 600 మందికిపైగా మృతి
- వేలాది మందికి గాయాలు
- గాజాను శిథిలం చేస్తా: నెతన్యాహు
- ఇజ్రాయిల్‌పై మోర్టార్లతో హిజ్బుల్లాల దాడి
- ఈజిప్టులో ఇద్దరు ఇజ్రాయిలీ టూరిస్టుల కాల్చివేత

గాజా సిటీ: పాలస్తీనా సాయుధ గ్రూపు హమాస్, ఇజ్రాయిల్ బలగాల మధ్య దాడులు, ప్రతిదాడులు ఆదివారం మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ ఘర్షణల్లో మృతుల సంఖ్య 600కు దాటింది. పాలస్తీనా భూ భాగంలోని గాజా సిటీలో గడచిన 24 గంటల వ్యవధిలో 250 మందికిపైగా మరణించారు. హమాస్‌పై ఇజ్రాయిల్ అధికారికంగా యుద్ధం ప్రకటించిందని నెతన్యాహు కార్యాలయం ఆదివారం వెల్లడించింది. హమాస్‌కు పట్టు ఉన్న గాజాప్రాంతాన్ని శిథిలంగా మారుస్తానని పచ్చి మితవాది, బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఆయన యుద్ధ ప్రతిపాదనకు భద్రతావ్యవహారాల కేబినెట్ కమిటీ శనివారం రాత్రి ఆమోదం తెలిపింది. గాజాపై ఇప్పటికే ఇజ్రాయిల్ వైమానిక దళాలు పెద్దయెత్తున దాడులకు దిగాయి.. ఈ దాడులు రెండవ రోజు కూడా కొనసాగడంతో గాజా ప్రజల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు కురిపిస్తున్న బాంబుల వర్షానికి పాలస్తీనా నేషనల్ ఇస్లామిక్ బ్యాంక్‌తో బాటు పలు పౌర మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడులో 400 మందికి పైగా పాలస్తీనియన్ పౌరులు చనిపోయారని, మరో 2200 మంది మిగతా 2లో

దాడులు, ప్రతిదాడులు ఆపండి

- ఇజ్రాయిల్, హమస్ ఘర్షణలపై సిపిఎం పొలిట్‌బ్యూరో

5

కృష్ణా జలాలపై

అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా జలాల అంశంపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల కేటాయింపుల పునఃపరిశీలనకు కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు కోరితేనే కేంద్రం జోక్యం చేసుకోవాలి తప్ప ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం, గెజిట్ విడుదల చేయడం చట్ట విరుద్ధమన్నారు. తెలంగాణా ఎన్నికల్లో బిజెపి లబ్ధిపొందేందుకు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆపేందుకు 'మీ వ్యక్తిగత పలుకుబడి'ని ఉపయోగించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ అంశంలో అలసత్వం ప్రదర్శిస్తే అది రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీటిని విభజన చట్టంలో ఉభయతారకంగా రెండు రాష్ట్రాల మధ్య పంపకం జరిగిందన్నారు. ఉన్న వాటాలను తిరగదోడడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించరాదన్నారు. న్యాయ పోరాటం చేయడంతోపాటు కేంద్రంపై రాజకీయంగా ఒత్తిడి తీసుకురావాలని అందుకు రాష్ట్ర ప్రజలు, అన్ని పార్టీల మద్దతును కూడగట్టేందుకు తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఒకరోజు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి పునఃసమీక్ష నిర్ణయాన్ని ఆపాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. ప్రధాని వద్దకు అఖిలపక్ష కమిటీని తీసుకెళ్ళాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

రైతు భరోసాకు పిఎం కిసాన్ గండి

- 14 లక్షల రైతులు ఔట్
- రాష్ట్రం ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో భారీ కోత
- ఉలకని ఎపి సర్కారు
- తన వాటాతో సరి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కేంద్రం విధించిన కఠిన ఆంక్షల మూలంగా నవరత్నాల్లో భాగంగా వ్యవసాయదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రైతు భరోసా లబ్ధిదారులకు భారీగా కోత పడుతోంది. ఈ నెల రెండవ పక్షంలో కేంద్రం విడుదల చేయనున్న 15వ కిస్తు (ఈ సంవత్సరంలో రెండవ కిస్తు) పెట్టుబడి సాయాన్ని దాదాపు 14 లక్షల మంది కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రమే అర్హత సాధించిన లబ్ధిదారులందరికీ ఈ సంవత్సరం వేసే రెండవ కిస్తు రూ.2 వేలు జమ కానున్నాయి. వివిధ దశల్లో కేంద్రం నిర్వహించిన వడపోతల తర్వాత సుమారు 14 లక్షల మంది లబ్ధిదారులు కేంద్రం నుంచి వచ్చే రూ.రెండు వేలు కోల్పోతున్నారు. కేంద్ర పథకం పిఎం కిసాన్‌తో కలిపి రైతు భరోసాను ఎ.పి. అమలు చేస్తున్నందున ప్రభుత్వాలు అందించే అరకొర ఆర్థిక సహాయాన్నీ లక్షలాదిగా కోల్పోవాల్సి రావడంపై రైతుల్లో పెద్ద ఎత్తున ఆందోళన బయలుదేరింది.

వాటితోనే తంటా

పిఎం కిసాన్ సహాయానికి కేంద్రం కొత్తగా మూడు తప్పనిసరి నిబంధనలు విధించింది. సొంత భూమి కలిగిన రైతు ల్యాండ్ సీడింగ్ (లింకేజి), ఆధార్ బేస్డ్ పేమెంట్ (ఎబిపిఎస్), ఇ-కెవైసి చేయించుకోవాలి. ఈ మూడింటిలో ఏది లేకపోయినా కేంద్రం నుంచి పిఎం కిసాన్ సహాయం పడదు. ఇదిలా ఉండగా రైతులకు ప్రతి ఏటా వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం రూ.13,500 ఇస్తామని వైసిపి హామీ ఇచ్చింది. తదుపరి కేంద్ర పథకం పిఎం కిసాన్‌తో లింక్ చేసింది. ఇస్తామన్న సహాయంలో కేంద్రం నుంచి రూ.ఆరు వేలొస్తే తాను రూ.7,500 ఇస్తానంది. అది కూడా ఒకేసారి కాకుండా ప్రతి నాలుగు మాసాలకోమారు ఏడాదిలో మూడు వాయిదాల్లో ఇస్తామంది. ఈ సంవత్సరం ఖరీఫ్‌కు ముందు జూన్ ఒకటో తేదీన రాష్ట్ర సర్కారు తన వాటా రూ.5,500 విడుదల చేసింది. ఆ తర్వాత ఎప్పటికో కేంద్రం తన వాటా రూ.2 వేలు జమ చేసింది. కాగా ఈ ఏడాది రెండవ కిస్తు రూ.2 వేలు జమ చేసేందుకు కసరత్తు చేస్తున్న కేంద్రం, నిబంధనలపై గట్టిగా పట్టుపట్టింది. ఇదిలా ఉండగా కౌలు రైతులు కాకుండా సొంత భూమి కలిగిన రైతుల్లో 52,30,639 మందిని భరోసాకు అర్హులుగా నిర్ధారించి వారందరికీ రాష్ట్రం తన వాటా విడుదలకు సన్నద్ధమవుతుండగా, పిఎం కిసాన్‌కు మాత్రం 40,36,694 మందినే కేంద్రం మిగతా 2లో

పథకం పేరు : వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్

భరోసా లబ్ధిదారులు : 52,30,639 మంది

పిఎం కిసాన్ లబ్ధిదారులు : 40,36,694 మంది

రాష్ట్రం, కేంద్రం మధ్య వ్యత్యాసం: 12,67,333

కేంద్ర కొత్త నిబంధనల వలన సాయం కోల్పోతున్న వారు : 1,34,124 మంది

మొత్తంగా రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య తేడా: 14,01,457

రోమ్‌లో భారీ నిరసన ర్యాలీ

- మెలోని విధానాలపై కార్మికవర్గం కన్నెర్ర

5

దుర్గగుడి ఇఒగా కెఎస్ రామారావు నియామకం

- తక్షణం విధుల్లో చేరాలని ఆదేశం

ప్రజాశక్తి - వన్‌టౌన్

విజయవాడలోని ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయానికి నూతన కార్యనిర్వాహణాధికారిగా శ్రీకాళహస్తిలో ఆర్‌డిఒగా విధులు నిర్వహిస్తున్న కెఎస్ రామారావును నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీచేసింది. ఇప్పటివరకు ఇఒగా పనిచేసిన దర్భముళ్ల భ్రమరాంబ స్థానంలో గత ఐదు రోజుల క్రితం ఎన్‌టిఆర్ జిల్లా డిఆర్‌ఒగా పనిచేస్తున్న ఎం శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించిన విషయం విదితమే. అయితే ఆయనను విధుల నుండి రిలీవ్ చేయకపోవడం, మరో వారం రోజుల్లో దుర్గమ్మ దసరా ఉత్సవాలు దగ్గర పడుతుండడంతో కెఎస్ రామారావును నియమించింది. వెంటనే విధుల్లో చేరాలని కూడా ఆదేశాలు జారీచేసింది.

బీహార్‌లో పండగపూట విషాదం

24 గంటల వ్యవధిలో 22 మంది జలసమాధి

పాట్నా : బీహార్‌లో పండగ పూట విషాదం నెలకొంది. జీవిత పుత్రిక పండగ నేపథ్యంలో 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నదులు, చెరువుల్లో స్నానం చేస్తూ మునిగి 22 మంది మరణించారు. బీహార్ ప్రభుత్వం ఆదివారం ఈ వివరాలను అధికారికంగా విడుదల చేసింది. బీహార్ మహిళలు తమ పిల్లలు క్షేమంగా ఉండాలని జీవితపుత్రిక పండుగ జరుపుకుంటారు. ఈ పండగ సందర్భంగా 24 గంటల పాటు ఉపవాసం ఉంటారు. నదులు, చెరువుల్లో స్నానం చేస్తారు. శనివారం స్నానం చేస్తూ భోజ్‌పూర్ జిల్లాలో ఐదుగురు, జహనబాద్ జిల్లాలో నలుగురు, పాట్నా, రోహతాస్ జిల్లాల్లో ముగ్గురేసి, దర్భాంగ, నవాడా జిల్లాల్లో ఇద్దరేసి నీటిలో మునిగిపోయి మరణించారు. మధేపుర, కైమూర్, ఔరంగబాద్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున నీట మునిగి చనిపోయారు. ఈ ప్రమాదాలపై ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులపై ఆధారపడిన కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు.

ప్రపంచకప్‌లో భారత్ బోణీ

- ఛేదనలో రాహుల్, కోహ్లి జోరు
- జడేజా, కుల్దీప్, అశ్విన్ మ్యాజిక్
- ఆసీస్‌పై భారత్ ఘన విజయం

లక్ష్యం 200 పరుగులు. ఛేదనలో రెండు పరుగులకే టాప్ ఆర్డర్‌లో మూడు వికెట్లు పతనం. రోహిత్, కిషన్, అయ్యర్ సున్నా పరుగులకే నిష్క్రమించారు. బంతి తిరుగుతున్న పిచ్‌పై మాక్స్‌వెల్, జంపా మాయను కాచుకుని నిలువటం సాధ్యమేనా అనే అనుమానాలు. ఇక్కడే విరాట్ కోహ్లి (85), కెఎల్ రాహుల్ (97) మ్యాచ్‌ను మలుపు తిప్పారు. అర్థ సెంచరీలతో నాల్గో వికెట్‌కు 165 పరుగులు జోడించిన కోహ్లి, రాహుల్.. చెన్నైలో కంగారూ కొట్టి ప్రపంచకప్ వేటను షురూ చేశారు.

చెన్నై : ఐసీసీ 2023 ప్రపంచకప్ వేటలో టీమ్ ఇండియా తొలుత ఆస్ట్రేలియా మెడలు వంచింది. ఆదివారం చెన్నైలో జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 6 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. 200 పరుగుల ఛేదనలో కెఎల్ రాహుల్ (97 నాటౌట్, 115 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (85, 16 బంతుల్లో 6 ఫోర్లు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. రోహిత్ శర్మ (0), ఇషాన్ కిషన్ (0), శ్రేయస్ అయ్యర్ (0) ఖాతా తెరవకుండానే నిష్క్రమించటంతో 2/3తో నిలిచిన భారత్ తీవ్ర ఒత్తిడిలో కూరుకుంది. రాహుల్, కోహ్లి జోడీ ఆసీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని విజయాన్ని అందించింది. తొలుత రవీంద్ర జడేజా (3/28), కుల్దీప్ యాదవ్ (2/42), జస్ప్రీత్ మిగతా 5లో

పెనుకొండ ఎమ్మెల్యే కారుపై

డిటోనేటర్‌తో దాడి

ప్రజాశక్తి- గోరంట్ల రూరల్ (ప్రకాశం జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కారుపై ఓ వ్యక్తి ఎలక్ట్రికల్ డిటోనేటర్ విసిరాడు. అది పేలకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... గడ్డంతండా పంచాయతీలోని కల్లితండాలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్యే శంకరనారాయణ తన కారులో ఆదివారం వచ్చారు. ఆయన వాహనం దిగి కొంతదూరం వెళ్లగానే పక్కనే ఉన్న ఓ వ్యక్తి ఎలక్ట్రికల్ డిటోనేటర్‌ను ఆ కారుపై విసిరాడు. అది పేలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు పాల్పడిన సోమందేపల్లి మండలం గుడిపల్లి గ్రామానికి చెందిన గణేష్‌ను సిఐ సుబ్బరాయుడు అదుపులోకి తీసుకొని గోరంట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని కోరాడు. సిఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ నాసన్‌లో రాళ్లు తొలగించే వాహన డ్రైవర్‌గా నిందితుడు గణేష్ పనిచేస్తున్నాడని, తన జేబులోని డిటోనేటర్‌ను మద్యం మత్తులో ఎమ్మెల్యే కారుపై విసిరాడని తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతు కుదేలు

- దిగుమతి సుంకం రద్దుతో ధరల తిరోగమనం
- కేంద్రం తీరుతో సాగుదారులకు నష్టం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాలో లాభాల పంటలా కీర్తి గడించిన ఆయిల్ పామ్ సాగు నష్టాల బాట పట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్‌పై దిగుమతి సుంకం రద్దు చేయడంతో గతేడాదిగా పరిస్థితి తలకిందులైంది. దేశీయ మార్కెట్లో ధరలు పడిపోవడం పరిపాటిగా మారింది. వంట నూనెలు ఉత్పత్తి చేసే సంస్థలు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ఆయిల్‌పామ్ ధరలు నేలను తాకుతున్నాయి. గతేడాది మేలో టన్ను గెలలకు గరిష్టంగా రూ.23,365 ధర ఉండగా, ప్రస్తుతం ఇది రూ.12,900కు పడిపోయింది. ఇదే ధర కొనసాగితే ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు నష్టపోతామని సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 19 మండలాల్లో 40,826 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. అత్యధికంగా నల్లజర్లలో 10,490 ఎకరాల్లో సాగులో ఉంది. జిల్లాలో ఈ ఏడాది మరో ఐదు వేల ఎకరాల్లో సాగు

విస్తీర్ణం పెంచాలని అధికారులు లక్ష్యంగా తీసుకున్నారు. ఈ లక్ష్యంలో 4,175 ఎకరాల్లో మొక్కలు నాటడం ప్రారంభమైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ దశలో ధరలు తిరోగమనంలో ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టన్నుకు కనీసం రూ.20 వేలు ఇప్పించాలని కోరుతున్నారు.

గతంలో లాభాల పంట

జిల్లాలో పండిన ఆయిల్‌పామ్ గెలలను గానుగ ఆడించి, ముడి చమురును పెద్దాపురం, నల్లజర్లలోని యర్నగూడెంలలో మిల్లులకు తరలిస్తుంటారు. ఆయా మిల్లుల్లో ప్రతి నెలా సగటు ముడి చమురు నిష్పత్తి (ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో-ఒఇఆర్) ఆధారంగా అధికారులు, వ్యాపారుల కమిటీ ఆయిల్‌పామ్ గెలలకు ధర నిర్ణయిస్తుంది. గతేడాది ఫిబ్రవరి మూడో వారంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఆయా దేశాల నుంచి క్రూడ్ పామాయిల్ (సిపిఒ) దిగుమతి నిలిచిపోయింది. దీంతో, దేశీయంగా వంట నూనెలను ఉత్పత్తి చేసే కంపెనీలకు ముడిసరకు కొరత ఏర్పడింది. దీంతో, రైతుల నుంచి ఆయిల్‌పామ్ గెలలను ఆయా కంపెనీలు పోటీపడి కొనుగోలు చేశాయి. గతేడాది మార్చిలో టన్నుకు రూ.21,940, ఏప్రిల్‌లో రూ.22,518, మేలో రూ.23,365 చొప్పున చెల్లించాయి. గడిచిన 16 నెలల్లో పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. ఈ ఏడాది ప్రారంభంలో టన్నుకు రూ.13,600 చొప్పున కంపెనీలు ధర చెల్లించాయి. ప్రస్తుతం మరో రూ.700 ధర పడిపోయింది. దీంతో, తాము నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో తిరోగమనం

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ధరలు ఒక్కసారిగా నేలను తాకాయి. 2020 సెప్టెంబరులో టన్ను ధర రూ.10,112 ఉంది. ఆ తర్వాత నుంచి క్రమేపీ ధరలు పెరిగాయి. 2021 జనవరిలో రూ.15,500కు జూన్‌లో రూ.16,828 చొప్పున కంపెనీలు కొనుగోలు చేశాయి. 2022 జనవరిలో రూ.17,000, ఫిబ్రవరిలో రూ.19,300, మార్చిలో రూ.21,940 ఏప్రిల్‌లో రూ.22,518, మేలో రూ.23,365 చొప్పున ధర చెల్లించాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో దిగుమతులు మందగించాయి. కేంద్రంలోని మిగతా 2లో

నేడు విజయవాడలో వైసిపి పదాధికారుల సమావేశం

- ఏర్పాట్లను పరిశీలించిన సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పదాధికారుల సమావేశం సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొనే ఈ సమావేశానికి 8,222 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు వైసిపి శ్రేణులు చెబుతున్నాయి. ఈ సమావేశ ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యత వుందన్నారు. ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేని స్థితిలో టిడిపి వుందన్నారు. అవినీతి కేసులో చంద్రబాబునాయుడు అరెస్టు అయితే, విప్లవకారులను అరెస్టు చేసినట్లు ఆ పార్టీ హడావుడి చేస్తోందని విమర్శించారు. జోగి రమేష్ మాట్లాడుతూ ఐదు కోట్ల ప్రజలకు ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి, వైసిపి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి గౌతంరెడ్డి, పార్టీ గ్రీవెన్స్ సెల్ చైర్మన్ నారాయణ మూర్తి, నాయ కులు పుత్తా ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రైతు భరోసాకు పిఎం కిసాన్ గండి

(మొదటి పేజీ తరువాయి)

అర్హులుగా పేర్కొంది. వారిలో 39,83,277 మందికి ల్యాండ్ సీడింగ్ పూర్తయింది. 53,417 మంది ల్యాండ్ సీడింగ్ ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ల్యాండ్ సీడింగ్ కంప్లీట్ అయిన వారిలో 39,24,505 మందికే ఆధార్ బేస్డ్ పేమెంట్ కంప్లీట్ అయింది. 58,772 మంది ఎబిపిఎస్ పెండింగ్‌లో ఉంది. ఇక ఎబిపిఎస్ పూర్తయిన వారిలో 39,02,570 మందికే ఇ-కెవైసి పూర్తయింది. 21,935 మంది ఇ-కెవైసి పెండింగ్‌లో ఉంది.

మాట్లాడని ఎపి సర్కారు

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన భరోసా లబ్ధిదారుల సంఖ్యకు, కేంద్ర పథకం పిఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసం నెలకొంది. రాష్ట్ర వాటా సొమ్ము పడ్డ వారిలో లక్షల మందికి కేంద్ర వాటా పడకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పిఎం కిసాన్ లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను కేంద్రం రాష్ట్రంపైనే పెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసే అమలు చేస్తున్న పథకంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన లబ్ధిదారుల కంటే కేంద్రం అందించే సాయానికి లబ్ధిదారులు లక్షల్లో తక్కువ ఉండటంపై రాష్ట్ర సర్కారు కేంద్రాన్ని అడగట్లేదు. తన వాటా మాత్రం విడుదల చేసి గమ్మునుంటోంది. దాంతో ప్రభుత్వం ఇస్తామన్న అరకొర సాయాన్ని కూడా రైతులు కోల్పోవాల్సి వస్తోంది.

కుమార్తెను గర్భవతిని చేసిన తండ్రికి మరణశిక్ష

- హర్యానా కోర్టు ఆదేశం

చండీగఢ్ : తన కుమార్తెను లైంగికంగా వేధించి గర్భవతిని చేసినందుకు తండ్రికి మరణశిక్ష విధిస్తూ పాల్వాల్‌లోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పునిచ్చింది. రూ.15 వేల జరిమానా కూడా విధించింది. బాలికకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. తనకు 11 ఏళ్ల వయసున్నప్పటి నుంచి తన తండ్రి అత్యాచారం చేస్తున్నాడంటూ బాలిక 2020 అక్టోబర్‌లో ఫిర్యాదు చేసింది. దోషి తల్లిలేని బాలికను నిత్యం వేధిస్తూ మద్యం తాగించేవాడు.

బాలిక గర్భం దాల్చిన తర్వాత కూడా లైంగిక వేధింపులు కొనసాగించాడు. 16 ఏళ్ల వయసులో ఆ బాలిక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. చిన్నారి డిఎన్‌ఎ శాంపిల్స్ తీసి పరీక్షించిన అనంతరం నిందితుడికి మరణశిక్ష విధించారు. శిక్ష ఖరారు చేసిన అనంతరం 41 ఏళ్ల నిందితుడు చాలా క్రూరంగా ప్రవర్తించాడని, అందుకే క్షమించలేమని కోర్టు పేర్కొంది.

ప్రశ్నిస్తే సహించలేకపోతున్న పాలకులు

- 'న్యూస్‌క్లిక్'పై దాడి దీనిలో భాగమే
- ప్రమాదంలో ప్రజాస్వామ్యం
- ఎస్‌వికె వెబినార్‌లో వక్తలు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

ప్రశ్న ఉనికే ప్రశ్నార్థకంగా మారుతోందని, ప్రశ్నిస్తే పాలకులు సహించలేకపోతున్నారని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, పాత్రికేయ విలువల్ని కాలరాస్తోందని, దానిలో భాగంగానే 'న్యూస్‌క్లిక్'పై అక్రమ కేసులు, అరెస్టులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడులు అన్న అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వెబినార్ జరిగింది. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ఒయు జర్నలిజం రిటైర్డ్ అధ్యాపకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యాపకులు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి వక్తలుగా మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మీడియాను పూర్తిగా తనకు అనుకూలంగా మార్చుకుంటోందని, అలా కుదరనప్పుడు ఆ సంస్థల్నే పూర్తిగా కొనుగోలు చేస్తోందని, అదీ సాధ్యం కాకుంటే 'ఉపా' చట్టం ప్రయోగించి ప్రశ్నించే మీడియా సంస్థల నోరునొక్కే ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'న్యూస్‌క్లిక్' యాజమాన్యం



వెబినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, కె.శ్రీనివాస్

ప్రజాసమస్యలకు బాసటగా నిలిచిందని, దానిలో భాగంగానే అభ్యుదయ భావాలున్న ప్రబీర్ పుర్కాయస్థ... ఢిల్లీ రైతాంగ పోరాటం, ఢిల్లీలో పౌరహక్కులు, కశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘన లు, మణిపూర్ హింసలో ప్రభుత్వాల ఉదాసీనత వంటి అంశాలను జనబాహుళ్యంలోకి తెస్తూ బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారని తెలిపారు. దాన్ని సహించలేకే కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థపై తప్పుడు కేసులు పెట్టి, వేధింపులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక మీడియా సంస్థపై దాడి కాదని, పౌరసమాజంపై పాలకవర్గం చేస్తున్న దాడిగానే చూడాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిబిసిని బెదిరించి, అదుపుచేసే ప్రయత్నం చేసిందని, ఎన్‌డిటివిలోకి దొడ్డిదోవలో పెట్టుబడులు పెట్టించి, దాన్ని హస్తగతం చేసుకొని ప్రభుత్వ అనుకూల మీడియాగా మార్చేసిందని తెలిపారు. న్యూస్‌క్లిక్ సంపాదకులను అరెస్టు చేసి ఢిల్లీ రైతాంగ పోరాటానికి అనుకూలంగా ఎందుకు వ్యవహరించారని, షహీన్‌బాగ్ ఆందోళనల్లో భాగస్వాములైన బాధితుల గాథలు ఎందుకు ప్రచురించారని ప్రశ్నిస్తున్నారని, దర్యాప్తు సంస్థల దిగజారుడుతనానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలని ప్రశ్నించారు. దేశంలో ఒకే గొంతు వినపడాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తున్నాయని, భిన్నాభిప్రాయాలు, ప్రశ్నలు ఉండరాదనే ఉద్దేశంతోనే ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని చూస్తున్నాయని అన్నారు. న్యూస్ క్లిక్‌పై జరిగిన దాడి, రేపు మరో సంస్థపైనా జరుగుతుందని, మీడియా పక్షాన నిలవాల్సిన ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఎటునిలవాలో తేల్చుకోలేని డోలాయమానంలో ఉండిపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. జర్నలిస్టులపై 'ఉపా' చట్టం పెట్టినప్పుడు స్పందించాల్సిన స్థాయిలో పాత్రికేయ సమాజం చొరవ చూపట్లేదని, ఇలాంటి చర్యలు ప్రభుత్వాలకు మరింత అనుకూలంగా మారుతున్నాయని అన్నారు. మీడియా సంస్థలకు చైనా నుంచి నిధులు వస్తున్నాయని కేంద్రప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

అసైన్డ్ భూముల వెరిఫికేషన్ సర్వే పూర్తయ్యేనా?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసైన్డ్ భూముల రీసర్వే, వెరిఫికేషన్ లక్ష్యానికి దూరంగా సాగుతోంది. ఈ ఏడాది జులై 31 నాటికి 20 ఏళ్ల పైబడి సాగు చేస్తున్న రైతులకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి విదితమే. ఇందులో భాగంగా సాగులో ఉన్న అసైన్డ్ భూములను గుర్తించేందుకు వెరిఫికేషన్ సర్వే చేపట్టింది. సెప్టెంబరు నుంచి మూడు నెలల్లోగా వెరిఫికేషన్ సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం.. అక్టోబర్ చివరి నాటికి సర్వే పూర్తికావాల్సివుంది. కానీ సర్వే నత్తనడకన సాగుతుండటంతో ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 27.41 లక్షల ఎకరాలు అసైన్డ్ భూములున్నట్లు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. భూములు అసైన్డ్ చేసిన వారి పేరు మీద ఉన్నాయా? లేదా చేతులు మారాయా? ఎవరైనా కొనుగోలు చేశారా? అనే అంశాలపై అధికారులు సర్వేలో భాగంగా వెరిఫికేషన్ చేయాల్సివుంది. క్షేత్రస్థాయిలో విఆర్‌ఓలు అసైన్డ్ భూముల వివరాలకు సేకరించాలి. వీరు సిద్ధం చేసిన జాబితాలను తహశీల్దార్లు ధ్రువీకరించాలి. ఆ తర్వాత ఆర్‌డిఓలు, జాయింట్ కలెక్టర్లు పరిశీలించి తుది జాబితా రూపొందించి ప్రభుత్వానికి అందించాలి. అయితే ఇప్పటి వరకు 4 వేల గ్రామాల్లో సుమారు 8 లక్షల ఎకరాల భూములకు మాత్రమే విఆర్‌ఓలు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. తహశీల్దార్ల స్థాయిలో 2,600 గ్రామాలు వెరిఫికేషన్ పూర్తికాగా, జాయింట్ కలెక్టర్ల స్థాయిలో కేవలం 150 గ్రామాల్లోనే వెరిఫికేషన్ పూర్తయ్యింది. ఈ నెలాఖరు వరకు 27.41 లక్షల ఎకరాలు వెరిఫికేషన్ పూర్తి చేయాల్సివుండగా.. ఇంకా వెరిఫై చేయాల్సిన భూములు 19 లక్షల ఎకరాలున్నాయి. రెండు నెలల్లో కేవలం 8 లక్షల ఎకరాలే వెరిఫికేషన్ పూర్తి చేసిన నేపథ్యంలో మిగిలిన 20 రోజుల్లో దాదాపు 11 లక్షల ఎకరాల వెరిఫికేషన్ పూర్తి సాధ్యం కాదని అధికారులే వాపోతున్నారు.

భూపంపిణీకి కసరత్తు

- 60 వేల ఎకరాల అసైన్డ్ భూమి గుర్తింపు
- దీపావళికి పంపిణీ చేసే యోచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు వ్యవసాయ యోగ్యమైన అసైన్డ్ భూములను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. దీపావళి నాటికి కొంతమందికైనా భూములను పంపిణీ చేయాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన క్షేత్రస్థాయి నివేదికలను జిల్లాల కలెక్టర్లు ఇటీవలే ప్రభుత్వానికి సమర్పించారు. భూపంపిణీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సైతం పూర్తి చేసినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో భూపంపిణీ ఏ తేదీల్లో చేపట్టాలనేది ఇంకా ఖరారు చేయాల్సివుంది. దీపావళి పండగ సందర్భంగా ప్రతి జిల్లాలో కొందరికైనా భూములు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 62 వేల మంది లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. శ్రీసత్యసాయి జిల్లాలో 5276 మందికి 7476 ఎకరాలు, కృష్ణ జిల్లాలో 7336 మందికి 4800 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 3425 మందికి 4116 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 3110 మందికి 3589 ఎకరాలు, వైఎస్‌ఆర్ కడప జిల్లాలో 2343 మందికి 3500 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 3627 మందికి



3 వేల ఎకరాలు, నంద్యాల జిల్లాలో 2012 మందికి 3800 ఎకరాల భూములను రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేయడానికి గుర్తించింది. భూముల లభ్యతను బట్టి అర ఎకరం నుంచి రెండు ఎకరాల వరకు భూమిని పంపిణీ చేసేవీలుంది. అయితే విశాఖపట్టణం జిల్లాలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేనట్లు అధికార యంత్రాంగం గుర్తించినట్లు తెలిసింది. కాగా వ్యవసాయ భూమికి సంబంధించి ఇప్పటి వరకు గుర్తించిన లబ్ధిదారులు 44 వేల మందిని ఉండగా.. 48,250 ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేయనున్నారు. లంక భూములకు సంబంధించి మూడు కేటగిరీలుగా ప్రభుత్వం విభజించింది. ఎ, బి కేటగిరీ భూములను 3,600 మంది లబ్ధిదారులకు 1325 ఎకరాలు, అలాగే సి కేటగిరి కింద 15,500 మంది లబ్ధిదారులకు 767.89 ఎకరాల భూములను పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరి సారిగా 2013లో పేదలకు భూముల పంపిణీ చేపట్టారు. ఆ తర్వాత భూపంపిణీ చేపట్టిన దాఖలాల్లేవు.

సమగ్రాభివృద్ధికై నవంబర్ 7న భారీ బహిరంగసభ

- 21 నుండి మూడు బస్ జాతాలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాజిక, ప్రాంతీయ అసమానతలు లేని సమగ్రాభివృద్ధికోసం ప్రత్యామ్నాయ విధానాలతోకూడిన ప్రజా ప్రణాళికలు రూపొందిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ నెల 7న విజయవాడ నగరంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధికోసం భారీ బహిరంగ సభ జరుగుతుందని, దీనికి సిపిఎం అఖిలభారత ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారని తెలిపారు. విజయవాడలోని ఎంబివికెలో సిపిఎం ఆధ్వర్యంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో ఆయన ముగింపు ఉపన్యాసం చేస్తూ, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని అన్నారు. . వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగం, సాగునీటి ప్రాజెక్టులు, విద్య,వైద్యరంగాలు, సామాజిక న్యాయం, ప్రాంతీయ అభివృద్ధి-రాజధాని అంశం, స్థానిక సంస్థలు- వికేంద్రీకరణ- సచివాలయాలు, విభజన చట్టం హామీలు అమలు లాంటి ఎనిమిది కీలకాంశాలపై నిర్వహించిన సెమినార్ ఆదివారం సాయంత్రం ముగిసింది.. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే అనంతపురంలో మొదలు పెట్టిన ప్రజారక్షణ భేరీ కార్యక్రమం ఈ నెల 20తేదీతో ముగుస్తుందన్నారు. 21 నుండి వచ్చే నెల మూడోతేదీదాకా సమగ్రాభివృద్ధికోసం మూడు బస్‌జాతాలు జరుగుతాయని తెలిపారు. పార్వతీపురం జిల్లా సీతంపేట

నుండి సామాజిక బస్సు జాతా, కర్నూలు జిల్లా ఆదోని నుండి కరువు, వెనుకబాటుతనం జాతా, శ్రీకాకుళం మందస నుండి పారిశ్రామిక జాతా బయలు దేరుతుందన్నారని అన్నారు. నవంబర్ 3వ తేదీనాటికి ఈ మూడు జాతాలు విజయవాడకు చేరుకుంటాయని తెలిపారు. అనంతరం నవంబర్ 7న భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి అజెండాగా జరిగే ఈ చారిత్రాత్మకమైన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం చేసిందన్నారు. అలాంటి బిజెపితో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటకాగుతోందన్నారు. జనసేన నాయకుడు ఎన్డీయేనుండి బయటకు ఒకడుగు ముందుకేసినట్టుగా చెప్పి, ఇంతలోనే నాలుగడుగులు వెనక్కి వేశారని అన్నారు.. బిజెపితో బంధంపై తెలుగుదేశం తన వైఖరేమిటో తేల్చి చెప్పాలన్నారు.

ఇప్పుడు జరగాల్సింది పెట్టుబడి కేంద్రీకరణ, విస్తరణ కాదు, అభివృద్ధి వికేంద్రీకరణ అని ఆయన అన్నారు. రాష్ట్రంలో అదానీకి గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని అన్నారు. . అదాని ఇప్పటి దాకా కొత్తగా పెట్టుబడి పెట్టడం లేదని ఇప్పటికే వున్న కృష్ణపట్నం, గంగవరం పోర్టులను కబళించారని అన్నారు. అలాగే రోడ్లు, విజయవాడ రైల్వేస్టేషన్, భూములను అదానీకే కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. దళితుల చేతుల్లో వున్న అసైన్డ్‌భూములను లాక్కునేందుకు ఆ చట్టాన్ని సవరణలు తీసుకొచ్చిందన్నారు. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70, పెసా, అయిదో షెడ్యూల్ వంటి రక్షణలను తుంగలో తొక్కి అటవీ భూములను లాక్కొని కార్పొరేట్లకు ప్రభుత్వం కట్టబెడుతోందని ఆయన విమర్శించారు..

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్‌రావు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004-05లో సెస్ సంస్థ సమగ్రాభివద్ధిపై ఒక అధ్యయనం జరిగి ఒక పుస్తకాన్ని వేశారని అన్నారు. విభజన తర్వాత రాష్ట్రంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఏమి చేయాలనే అంశంపై ఒక సమగ్ర విధానమేదీ లేదన్నారు.. సిపిఎం ఆ ప్రయత్నం చేయడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి విజ్ఞాన కేంద్రాలు, జనవిజ్ఞాన వేదిక ద్వారా జిల్లాల్లో కూడా ఇలాంటి సెమినార్‌లు నిర్వహించి నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించడదం జరుగుతుందన్నారు. ఇపుడు జరిగిన సెమినార్‌లో వచ్చిన డాక్యుమెంట్లతో ఒక పుస్తకాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము పాల్గొన్నారు.

రాష్ట్రంలో కళ్లు మూసుకున్న ఇడి,సిబిఐ

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నాసికరం మద్యం అమ్మకాల ద్వారా వేలకోట్లు దోపిడీ జరుగుతోందని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం తాగిన వారిలో నాడీవ్యవస్థ దెబ్బతినే విషరసాయనాలు ఉన్నాయని చెన్నైలోని ఎస్‌జిఎస్ ల్యాబ్ పరీక్షల్లో వెల్లడైందని, అయినా ఇడి, సిబిఐ కళ్లు ఎందుకు మూసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో జరిగిన మద్యం కుంభకోణంపై ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిని సైతం అరెస్టు చేసిన ఇడి, సిబిఐ ఏపి విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యం పణంగా పెట్టి దాదాపు చీప్ లిక్కర్ ద్వారా రూ.41వేల కోట్ల దోపిడీ చేశారని విమర్శించారు. అమ్మకాలు తగ్గించి చూపించి ప్రతి ఏటా రూ.7 వేల కోట్ల దోపిడీ జరుగుతోందని విమర్శించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పెద్దడ్రామా అని విమర్శించారు. పనిఒత్తిడితో ఇద్దరు ఆశ కార్యకర్తలు చనిపోయారని, ఆరోగ్యశ్రీ పథకం అమలుకే దిక్కులేదని ఆయన విమర్శించారు.

బిసిలకు జగన్ తీరని ద్రోహం : యనమల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

వ్యవహరిస్తున్న తీరు బిసిలకు తీరని ద్రోహం చేస్తోందని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. బిసిల జనగణనపై టిడిపి ప్రభుత్వం శాసనసభలో చేసిన తీర్మానం ఆమోదంపై ఎందుకు శ్రద్ధపెట్టలేదని ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో దీనిపై ఎందుకు మాట్లాడటం లేదని పేర్కొన్నారు. బీహార్ ప్రభుత్వం జనగణన పూర్తిచేస్తే రాష్ట్రంలో మాత్రం అక్రమ కేసులు, వేధింపులతో జగన్ మునిగితేలుతున్నారని విమర్శించారు. టిడిపి జనగణనకు కట్టుబడి ఉందని, అందుకే మహానాడులో కూడా తీర్మానం చేశామని పేర్కొన్నారు.

కృష్ణా జలాలపై 18న కడపలో రాష్ట్రస్థాయి సదస్సు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వెల్లడి

ప్రజాశక్తి-అమరామతి బ్యూరో

తెలంగాణ ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఎత్తుగడతో కృష్ణా నీటి జలాల విషయం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కుట్రపూరిత వైఖరిని తిప్పికొట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. కృష్ణా జలాల అంశంపై ఈ నెల 18న కడపలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సులో అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులు, రైతు సంఘాల నాయకులు, సాగునీటి రంగ నిపుణులు, సాగునీటి రంగంలో న్యాయ నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. బచావత్ ట్రిబ్యుల్ తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టిఎంసిలు కేటాయించగా అందులో విభజన అనంతరం ఏపికి 512, తెలంగాణకు 299 టిఎంసిలు కేటాయింపులు అమలుల్లో ఉన్నట్లు తెలిపారు.

తెలంగాణ సగం వాటా కావాలని వితండవాదం చేస్తోందన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్జేస్తే రాయలసీమ శాశ్వత ఎడారిగా మారుతుందని, తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. నీటి వివాదాలపై ట్రిబ్యునల్ తుది తీర్పు సుప్రీంకోర్టులో ఉండగా, కొత్తగా నీటి పంపిణీ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జగన్ రాష్ట్ర ప్రయోజనాలకంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధ్యానత ఇవ్వడం వల్ల రాయలసీమకు తీవ్ర నష్టం జరగే ప్రమాదం పొంచివుందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు ఎవరిచ్చారు ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రజల సంపదైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు కేంద్రంలోని మోడీ సర్కారుకు ఎవరిచ్చారని బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు కె విజయ్ కుమార్, జికెవి ప్రసాద్ ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను విరమించాలని డిమాండ్ చేస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 918వ రోజుకు చేరాయి. దీక్షల్లో బిహెచ్‌ఇఎల్ ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న విలువైన వేల ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు అమ్మేసే ప్రయత్నాలను విరమించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు.. ప్రజలందరి హక్కు అని, ఆ హక్కును హరించే అధికారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి లేదని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం జరిగిన పోరాటంలో బిజెపిగాని, దాని అనుబంధ సంస్థలుగానీ ఎక్కడా పాల్గొనలేదన్నారు. త్యాగాలతో ఏర్పడి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ కర్మాగారాన్ని అమ్మాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో సంఘం నాయకులు నారపురెడ్డి, శివకుమార్, రామారావు, అచ్చంనాయుడు పాల్గొన్నారు.

'మద్యం' అక్రమాలపై సిబిఐ దర్యాప్తు

- అమిత్‌షాకు పురందరేశ్వరి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మద్యం విధానంలో జరుగుతున్న అవకతవకలపై సిబిఐతో దర్యాప్తు చేయించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మద్యం అమ్మకాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, విధానపరంగానే అవకతవకలు జరిగినట్లు ఆమె పేర్కొన్నారు. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేయించాల్సిన అవసరముందని ఆమె విన్నవించారు.



ఫైబర్ గ్రిడ్ వ్యవహారంపై టిడిపి పుస్తకం ఆవిష్కరిస్తున్న అచ్చెన్న, పయ్యావుల కేశవ్, ఉమా

ఫైబర్ గ్రిడ్ వ్యవహారంపై టిడిపి పుస్తకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో ఒక్క రూపాయి అయినా అవినీతి జరిగిందని వైసిపి ప్రభుత్వం నిరూపించగలదా? అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఆ పార్టీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సవాలు విసిరారు. రాజకీయ కక్షతోనే వైసిపి తప్పుడు ఆరోపణలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఫైబర్ నెట్‌పై ఖర్చు రూ.280 కోట్లు - ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.900 కోట్లు నిజం అవినీతి అబద్ధం' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం వారు విడుదల చేశారు. ప్రజలకు మేలు చేసిన ప్రాజెక్టుపై నిందలు వేయడం రాజకీయ కుట్ర కాదా అని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. నెలకు రూ.149లకే ఇంటికి ఇంటర్నెట్, ఫోన్, టీవి ఛానళ్ల సౌకర్యం కల్పించామని తెలిపారు. ఎపి విధానాన్ని అనుసరించాలని ఇతర రాష్ట్రాలకు సైతం కేంద్రం సూచించిందని చెప్పారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసి ఇన్ని రోజులైనా పైసా కూడా అవినీతి జరిగినట్లు నిరూపించకలేకపోయారని తెలిపారు. ఫైబర్ నెటలో కూడా ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని, జరిగితే నిరూపించాలని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ధూళిపాళ్ల నరేంద్ర, బొండా ఉమామహేశ్వరరావు, పంచుమర్తి అనురాధ, పీతల సుజాత, పి అశోక్ బాబు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడిలో సర్వస్వం కోల్పోయి రోదిస్తున్న పాలస్తీనా మహిళలు

హమాస్, ఇజ్రాయిల్ బలగాల మధ్య ఘర్షణతో నెత్తురోడుతున్న గాజా

(మొదటి పేజీ తరువాయి)

గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. వందలాది మంది క్షతగాత్రులతో గాజా సిటీలో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇజ్రాయిల్ వైమానిక దాడుల వల్ల గాజా సిటీలో 80 శాతం ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మహిళలు, పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

హమాస్ 'అల్ అక్సా ఆపరేషన్'కు ప్రతిగా ఇజ్రాయిల్ చేపట్టిన 'ఐరన్ స్వోర్డ్స్ ఆపరేషన్' గాజాలో 400కి పైగా ప్రాంతాలను ధ్వంసం చేసింది.

ఇదిలా ఉండగా లెబనాన్ నుండి ఇజ్రాయిల్ ఆక్రమిత షెబా ఫామ్ ప్రాంతంపై హిజ్బుల్లా సాయుధ గ్రూపు మోర్టార్లతో దాడి చేసింది. దీనికి ఫిరంగులతో సమాధానం చెబుతామని ఇజ్రాయిల్ తెలిపింది.

ఈజిప్టులో పోలీసులు ఇద్దరు ఇజ్రాయిలీ టూరిస్టులను కాల్చివేసినట్లు అల్‌జజీరా వెబ్‌సైట్ తెలిపింది. గతంలో ఇజ్రాయిల్, పాలస్తీనీయుల మధ్య అనేక ఘర్షణలు జరిగాయి. కానీ, ఇటువంటి వినాశకరమైన దాడులను తానెన్నడూ చూడలేదని సనా కమల్ అనే స్థానికురాలు పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఖండన

దక్షిణ ఇజ్రాయిల్ ప్రజలపై జరిగిన క్రూరమైన దాడిని ఖండిస్తున్నామని కాంగ్రెస్ పేర్కొంది. ఆత్మగౌరవం, సమానత్వం, హుందాగా జీవించాలనే పాలస్తీనా ప్రజల న్యాయమైన ఆకాంక్షలను నెరవేర్చాలని తాము ఎప్పుడూ కోరుకుంటామని, అయితే, చర్చలు, సంప్రదింపుల ద్వారానే దీనిని సాధించాలని, హింస ఎన్నడూ పరిష్కారం చూపదని కాంగ్రెస్ పేర్కొంది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ తెలిపారు.

సిపిఐ ఆందోళన

పాలస్తీనా ఇజ్రాయిల్ ఘర్షణ పట్ల సిపిఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా మాట్లాడుతూ, ఇరు పక్షాల మధ్య ఘర్షణ యుద్ధ రూపం తీసుకుంటోంది. ఇరు వైపులా వందలాది మంది చనిపోతున్నారు. ఈ ఘర్షణలు మరింత తీవ్రతరం కాకుండా సంయమనంతో వ్యవహరించాలని ఇరు పక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఆయిల్‌పామ్ రైతు కుదేలు

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి ప్రభుత్వం క్రూడ్ పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని గతేడాది ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో ఆయిల్ కంపెనీలు, ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు ధరలను భారీగా తగ్గించాయి. అప్పటి నుంచి ప్రతి నెలా తగ్గించుకుంటూ వస్తున్నాయి. దిగుమతి సుంకం తగ్గడంతో ఆయిల్ కంపెనీలు దేశీయ మార్కెట్లో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు.

పరిస్థితి తలకిందులైంది

ఆయిల్‌పామ్ సాగు గతేడాది వరకూ ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పరిస్థితి తలకిందులైంది. ఎరువుల ధరలు పెరగడంతో సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఎకరాకు రూ.75,000 వరకూ పెట్టుబడి అయింది. దిగుబడులు, గిట్టుబాటు ధర రాకపోవడతో పెట్టుబడి కూడా రావడం లేదు.

- పాతూరి సత్యనారాయణ, పామాయిల్ రైతు, అచ్చెన్నపాలెం, నల్లజర్ల మండలం

ప్రజా చైతన్యంతో రాజ్యాంగం పరిరక్షణ

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు

సభలో మాట్లాడుతున్న జస్టిస్ మన్మధరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

భారత రాజ్యాంగం దాని అనుబంధ వ్యవస్థల గురించి ప్రజల్లో చైతన్యం పెరిగితే ప్రజాస్వామ్య పరిరక్షణ మరింత పటిష్టంగా ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె మన్మధరావు అన్నారు. గుంటూరులోని ఓ హోటల్‌లో ఆదివారం 'రాజ్యాంగ చర్చా వేదిక' ఆవిర్భావ సభ నిర్వహించారు. సభకు హాజరైన జస్టిస్ మన్మధరావు మాట్లాడుతూ ఆధునిక స్వతంత్ర భారత నిర్మాణంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సారథ్యంలో రూపొందించిన భారత రాజ్యాంగంలో పౌరులకు సంబంధించి ప్రాథమిక హక్కులు, న్యాయం, అభివృద్ధి, పరిపాలన గురించి విశేషంగా చర్చించబడిందని తెలిపారు. భారత రాజ్యాంగం అనేక అభివృద్ధి చెందిన దేశాల రాజ్యాంగాల పరిశీలన ద్వారా ముఖ్యంగా అన్ని కోణాలలో మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇస్తూ రాయబడిందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచినా సామాన్య ప్రజల్లో రాజ్యాంగం పట్ల నేటికీ పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం, ఒపిడిఆర్ వంటి సంస్థలు ప్రజాస్వామ్య హక్కుల కోసం కొంతవరకు కృషి చేయడానికి ప్రయత్నించాయన్నారు. అన్ని సమస్యలకు కోర్టులే పరిష్కారం అన్న అపోహలను విడనాడాలని చెప్పారు. 'రాజ్యాంగ చర్చా వేదిక' సంస్థ రాజకీయాలకతీతంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరక్షరాశ్యులను, విద్యావంతులను రాజ్యాంగ మౌలిక సూత్రాలపై చైతన్య పరచాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షులు డాక్టర్ ఎ రాజేంద్రప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తాతా సేవ కుమార్, రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్, వేదిక ఉపాధ్యక్షులు మేడా శ్రీనివాస్, కార్యదర్శి అవధానుల హరి, కోశాధికారి పిఎస్ మూర్తి, గౌరవ సలహాదారులు నడింపల్లి కమలకాంత్, ఎంవి రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

భూపోరాట రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-హిందూపురం

భూపోరాటం చేస్తూ భూములు తమకు దక్కుతాయో లేదో అన్న దిగులుతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన సత్యసాయి జిల్లా లేపాక్షి మండలం కొండూరులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... కుశలవ కంపెనీ యాజమాన్యంపై కొండూరు రైతులుతో పాటు వెంకటేష్(35) భూ పోరాటం సాగిస్తున్నారు. రెండు నెలల క్రితం భూముల విషయంలో దిగులు చెంది వెంకటేష్ తండ్రి చనిపోయారు. భూములపై అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం రాకపోవడంతో వెంకటేష్ మనస్తాపానికి గురై ఆదివారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలిసిన లేపాక్షి తహశీల్దార్ కె బాబు, రూరల్ సిఐ వేణుగోపాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం హిందూపురం జిల్లా ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే భూ బాధితులు వారికి కేటాయించిన భూముల కోసం పోరాటం చేస్తూ భూములు తమకు దక్కుతాయో లేదా అన్న దిగులుతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని దళిత రైతులు, సిపిఎం, కెవిపిఎస్ నాయకులు వాపోతున్నారు. మృతిచెందిన యువ రైతు కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు దుర్మరణం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

వరి పంటను కాపాడుకునే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గుత్తికొండకు చెందిన గంగిరెడ్డి మస్తాన్ (55) తనకున్న రెండెకరాల పొలంతోపాటు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నారు. పొలానికి నీరు పెడుతుండగా రెండు వారాల కిందట బోరు పాడైంది. దీన్ని బాగుచేయించేందుకు ఆదివారం హైడ్రాలిక్ ట్రాక్టర్‌ను పొలానికి తెచ్చారు.

పొలంలో కొద్దిగా తడి ఉండడంతో బోరు వద్దకు ట్రాక్టర్ వెళ్లలేక ఇరుకుపోయింది. దాన్ని రోడ్డుపైకి తీసుకొచ్చేందుకు పొరుగున ఉన్న బాదినీడి కొండవెంకయ్య (24)ను సాయం కోరారు. మస్తాన్, వెంకయ్య ఇద్దరూ కలిసి ట్రాక్టర్‌ను పొలం పక్కనున్న మట్టిరోడ్డు మీదుకు తెచ్చారు. స్టార్ట్ చేసే ప్రయత్నంలో ట్రాక్టర్‌ను నెడుతుండగా హైడ్రాలిక్ మిషన్‌కు పొలం నుండి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మస్తాన్ అక్కడికక్కడే మృతిచెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా వెంకయ్య మార్గం మధ్యలో చనిపోయారు. ట్రాక్టర్ డ్రైవర్ కిందకు దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పిడుగురాళ్ల పట్టణ సిఐ వీరాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి జయరాంకు మాతృవియోగం

ప్రజాశక్తి-చిప్పగిరి (కర్నూలు జిల్లా)

రాష్ట్ర కార్మిక, ఉపాధి, కర్మాగారాల శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు మాతవియోగం కలిగింది. కర్నూలు జిల్లా ఆలూరులోని తన నివాసంలో ఆదివారం ఉదయం మంత్రి తల్లి శారదమ్మ (78) హఠాత్తుగా అస్వస్థకు గురై కింద పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో, శారదమ్మ భౌతికకాయాన్ని ఆమె స్వగ్రామమైన గుమ్మనూరుకు కుటుంబసభ్యులు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

సామాజిక మాధ్యమాల్లో మరింత విస్తృత ప్రచారం

- కార్యకర్తలకు బిజెపి నిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక మాధ్యమాల్లో మరింత విస్తృతంగా ప్రచారం చేపట్టాలని బిజెపి నాయకులు తమ పార్టీ కార్యకర్తలకు నిర్దేశించారు. బిజెపి సోషల్ మీడియా వాలంటీర్ల రాష్ట్ర సమావేశం ఆదివారం విజయవాడలోని వెన్యూ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి మీనాక్షి లేఖీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియా కార్యకర్తలు పాత్రికేయుల్లా పనిచేయాలని, ప్రచారం విస్తృతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపి జివిఎల్ నరసింహారావు, బిజెపి సోషల్ మీడియా కన్వీనరు కేశవకాంత్ ప్రసంగించారు.

ఎస్ఎఫ్ఐ తొలి తరం నాయకులు వెంకటరామిరెడ్డి కన్నుమూత

ప్రజాశక్తి- దేవనకొండ/కర్నూలు కార్పొరేషన్,

ఎస్ఎఫ్ఐ తొలి తరం నాయకులు, కర్నూలు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కె.వెంకటరామిరెడ్డి (89) ఆదివారం కర్నూలులో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య సరస్వతి, కుమారులు ప్రకాష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి ఉన్నారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన పెద్ద లక్ష్మిరెడ్డి, హనుమంతమ్మలకు వెంకటరామిరెడ్డి 1935 జులై 1న జన్మించారు. తిరుపతిలో డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత ఇంగ్లీషులో పీజీ చేశారు. చిత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా కొంతకాలం పని చేశారు. ఆ తర్వాత కర్నూలు ఉస్మానియా కళాశాలలో ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్‌గా చేరారు. ఇక్కడే రిటైర్డ్ అయ్యారు. విద్యార్థి దశలోనే ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ఉస్మానియా కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేస్తూనే జిల్లాలో సిపిఎం ఉద్యమాభివృద్ధికి కషి చేశారు. తిరువనంతపురంలో 1970 డిసెంబర్‌లో జరిగిన ఎస్ఎఫ్ఐ ఆలిండియా మొట్టమొదటి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. ఆయన భార్య సరస్వతి కూడా పట్టభద్రురాలు. ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ ఆయనతో వివాహమైనప్పటి నుండి కమ్యూనిస్టు భావాలను కలిగి ఉండేవారు. ఉద్యమాల సందర్భంగా కమ్యూనిస్టు నాయకులు జిల్లాకు వచ్చినప్పుడు వారి ఇంట్లోనే ఆతిథ్యం పొందేవారు. పత్తికొండ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వర్‌రెడ్డి సిపిఎం తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు వెంకట్రామిరెడ్డి కుటుంబం ఆయన గెలుపునకు కృషి చేసింది. వెంకటరామిరెడ్డి భౌతికకాయానికి సోమవారం కర్నూలులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వెంకట్రామిరెడ్డి మృతికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ సంతాపం తెలిపారు. ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, తదితరులు ఉన్నారు.

వెంకటరామిరెడ్డి జీవితం ఆదర్శం: మధు

ప్రజాశక్తి-అమరామతి బ్యూరో

వెంకట్రామిరెడ్డి జీవితం ఆదర్శనీయమని సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. వెంకట్రామిరెడ్డి మృతికి నివాళ్లు అర్పించారు. లెక్చరర్‌గా పనిచేస్తూనే 1970లో జరిగిన తిరువనంతపురంలో జరిగిన ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపక సమావేశంలో కర్నూల్ జిల్లా నుండి పాల్గొన్న విద్యార్థి బృందానికి వెంకట్రామిరెడ్డి నాయకత్వం వహించారన్నారు. జిల్లాలో ఉద్యమాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి- విజయనగరం కోట

ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం లభించింది. ఆదివారం విజయనగరంలోని గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆయనకు ఈ అవార్డును ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి గురజాడ విశిష్ట పురస్కారాన్ని సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రముఖులకు ఏటా అందజేస్తున్నారు. నవంబరు 30న గురజాడ అప్పారావు వర్థంతి సందర్భంగా చంద్రబోస్‌కు ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ ఏడాది తెలుగు పాటకు అంతర్జాతీయ, జాతీయ పురస్కారాలను తెచ్చిన చంద్రబోస్‌ను గురజాడ విశిష్ట పురస్కారంతో సత్కరించనున్నామని సమాఖ్య అధ్యక్షులు పి.వి.నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్ వెల్లడించారు. తెలుగు సాహిత్య రంగంలో పదిమంది వర్థమాన కవులను గురజాడ ఉత్తమ సాహితీ పురస్కారంతో సత్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గురజాడ వారసులు గురజాడ వెంకట ప్రసాద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న తులసీదాస్, గోవిందరావు, జగ్గునాయుడు తదితరులు

చిరస్మరణీయుడు.. సత్యం మాస్టారు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి తులసీదాస్

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన కొల్లి సత్యనారాయణ (సత్యం మాస్టార్) చిరస్మరణీయులని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి తులసీదాస్ అన్నారు. గుండె సంబంధిత వ్యాధితో శనివారం కెజిహెచ్‌లో మృతిచెందిన సత్యం మాస్టారి సంతాప సభ విశాఖ జిల్లా గాజువాక సమీపంలోని తోకాడ సమైక్య అపార్టుమెంట్ ఆవరణలో ఆదివారం జరిగింది. తొలుత సత్యం మాస్టారి పార్థివ దేహం వద్ద పలువురు నివాళి అర్పించారు. ఆయన పార్థివ దేహంపై తులసీదాస్, సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు ఎర్రజెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో తులసీదాస్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో జన్మించిన సత్యం మాస్టారు అనంతర కాలంలో శ్రీకాకుళం వచ్చి అక్కడి పార్టీ అభివృద్ధి కోసం పనిచేశారని తెలిపారు. పోరాటాల్లో తీవ్ర నిర్బంధం ఎదుర్కొన్నారని, జైలులో నిర్బంధించబడ్డారని చెప్పారు. నిరంతర అధ్యయనశీలి అని, విషయ పరిజ్ఞానం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. సత్యం మాస్టారుతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎంతో ఆప్యాయంగా ఆదరించే గుణం సత్యం మాస్టారు సొంతమన్నారు. ఆయన భార్య సరోజిని అంతే ఓపిగ్గా ప్రతి కార్యకర్తనూ ఆప్యాయంగా చూసుకునేవారని తెలిపారు. వారి కుటుంబం ఆదర్శవంతమైందని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజశర్మ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు అవసరమైన ఎంతోమంది కార్యకర్తలను సత్యం మాస్టారు తయారు చేశారని గుర్తుచేశారు. డి గోవిందరావు మాట్లాడుతూ ఎన్ని నిర్బంధాలు ఎదురైనా ఎత్తిన ఎర్రజెండాను సత్యం మాస్టారు దించలేదన్నారు. జిల్లాలో జరిగిన ఎన్నో పోరాటాలకు ఆయన నేతృత్వం వహించారని తెలిపారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ సత్యం మాస్టార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నివాళ్లర్పించిన వారిలో సిపిఎం శ్రీకాకుళం నాయకులు పి తేజేశ్వరరావు, కె నాగేశ్వరరావు, కె శ్రీనివాస్, విశాఖ జిల్లా నాయకులు ఎం రాంబాబు, ఎన్ రాజేంద్రప్రసాద్, తోకాడ సమైక్య అపార్టుమెంట్ అసోసియేషన్ నాయకులు తౌడన్న, చిన్నంనాయుడు, సత్యం మాస్టారి కుటుంబీకులు అజేయ కుమారి, ప్రసాద్‌రాజు ఉన్నారు. సత్యం మాస్టారి అంతిమ యాత్ర సమైక్య అపార్టుమెంట్ నుంచి చినగంట్యాడ వందడుగుల రోడ్డులోని స్మశాన వాటిక వరకూ సాగింది. అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు.

సాకేత్‌ను సన్మానిస్తున్న మంత్రి రోజా

టెన్నిస్ స్టార్ సాకేత్‌కు ప్రభుత్వ ఉద్యోగం

- సన్మాన కార్యక్రమంలో మంత్రి రోజా

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

ఆసియా క్రీడల్లో టెన్నిస్ పురుషుల డబుల్స్‌లో రజత పతకం సాధించిన సాకేత్ మైనేనికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రకటించారు. సాకేత్‌కు రాష్ట్రంలో టెన్నిస్ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించే ఆలోచనలో ఉందని తెలిపారు. చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో సాకేత్ రజత పతకం సాధించిన నేపథ్యంలో విజయవాడ మొగల్రాజపురంలోని పిబి సిద్ధార్థ అకాడమీలో ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆదివారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి క్రీడలు మాత్రమే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమ్మ కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుమ్మల చంద్రశేఖర్, మాజీ ఎంపి గోకరాజు గంగరాజు, ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్టాభి రామయ్య, కార్యదర్శి పివి రామకుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం ఆవరణలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్, ఎన్‌టిఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సాకేత్‌ను ఘనంగా సన్మానించారు.

తెలంగాణలో లబ్ధిపొందేందుకే కృష్ణా జలాల పున:సమీక్ష

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

తెలంగాణ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే కృష్ణా జలాలపై పున:సమీక్షకు కేంద్రం ఆదేశాలిచ్చిందని పలువురు వక్తలు అన్నారు. కృష్ణా జలాలపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిడిపి నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికలలో లబ్ధిపొందడం కోసం నాలుగు రాష్ట్రాల వివాదాన్ని రెండు రాష్టాలకు పరిమితం చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. తద్వారా రాయలసీమలోని తెలుగుగంగ, గాలేరు, హంద్రీనీవా ప్రాజెక్టులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. అపెక్స్ కౌన్సిల్‌లో సభ్యునిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడకపోవడం, ఆ పార్టీకి చెందిన ఎంపిలు సైతం నోరుపెదపకపోవడం సరికాదన్నారు. దీనిపై రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాడ్ చేశారు. ఈ అంశంలో మంత్రి అంబటి రాంబాబుకు ఏ మాత్రమూ అవగాహన లేదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థత వల్లే కృష్ణా నదీజలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జగన్ చరిత్రహీనులుగా మిగిలిపోతారని విమర్శించారు. పోలవరం, వెలుగొండ తదితర ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయని, ప్రత్యేక హోదా, విభజన హామీలు గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, తెలుగు రైతు సంఘం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితులు పాలొన్నారు.

మహిళపై చిరుత దాడి

ప్రజాశక్తి- వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)

బాధిత మహిళ

తెల్లరాతి కంకర క్వారీ కార్మికులకు భోజనం తయాచేసే మహిళపై చిరుత దాడి చేసిన ఘటన చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజక వర్గం వెదురు కుప్పం మండల పరిధిలో ఆదివారం చోట్టు చేసుకుంది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం ఎర్రగుంటపల్లి సమీపం లోని శ్రీలక్ష్మీ శ్రీనివాస స్టోన్ క్రషర్‌లో పనిచేస్తున్న కార్మికులకు భోజన తయారీదారుగా వ్యవహరిస్తున్న తిరుపతి జిల్లా వెంకటగిరి ప్రాంతానికి చెందిన శైలజ ఆదివారం మధ్యాహ్నం కాలకృత్యాలు తీర్చుకోవడానికి తాము నివాసముంటున్న ప్రాంతానికి కొద్ది దూరం వెళ్లారు. అక్కడే పొదల్లో పొంచి ఉన్న చిరుత పులి ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. ఆమె భయాందోళనకు గురై గట్టిగా కేకలు వేయడంతో అక్కడ నుంచి చిరుత పారిపోయింది గాయపడిన ఆమెను పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ మహిళపై దాడికి పాల్పడింది చిరుత పులి కాకపోవచ్చు అని, హైనా అయి వుండవచ్చని అంటున్నారు. సంఘటనా స్థలంలోని పాదముద్రలు, మహిళకు అయిన గాయాలను పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడేది)
కార్పొరేట్ ఆఫీస్: నెం. 769, స్పెన్సర్స్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్ -II, అన్న సాలై, చెన్నై-600002.

స్వాధీనతా ప్రకటన (సెక్షన్ రూల్ 8 (1) క్రింద) స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటీ అండ్ రీఎన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం మెసర్స్ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారాములతో సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తమును, దానిపై వడ్డీతో కలిపి చెల్లించవలసినదిగా ఈ క్రింది పేర్కొనబడిన రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైంది. రుణగ్రహీతలు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని రూలు 8 ప్రకారము క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకోవడమైనదని ఈ క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. ముఖ్యంగా రుణగ్రహీతలు సాధారణ ప్రజానీకమును ఇందుమూలంగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల బాకీ మొత్తమునకు, వడ్డీ, ఇతర ఖర్చులు మొదలైనవి మెసర్స్ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లింపులకు లోబడి ఉంటాయి. సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) చట్టప్రకారం రుణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోడానికి శ్రద్ధ వహించవలెను.

క్ర. సం.	రుణగ్రహీతలు/ హామీదారుల పేర్లు	సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరణ (స్థిరాస్తి)	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయి	లాంఛనప్రాయంగా స్వాధీనం తేది
1	బ్రాంచ్-విజయవాడ రుణ నెం- ELPVJAWD0022303 రుణగ్రహీత : శ్రీ మేసపోగు నవీన్ ప్రసాద్ సహ-రుణగ్రహీత: శ్రీమతి మేసుపోగు చంద్ర లీల, శ్రీమతి మేసపోగు స్వాతి	అంబారుపేట గ్రామం మరియు గ్రామపంచాయతీ, నందిగామా మండలం, నందిగామా ఎస్ఆర్, రిజిస్ట్రేషన్ జిల్లా క్రిష్ణ వద్దగల ఆర్.ఎస్.నెం.67/14లోని విస్తీర్ణం: ఎక 0.03 సెంట్లు 230స్వేర్ లింకు లేదా 156.332చ.గ.లు లేదా 130.693 చ.మీ.లతో అసెస్‌మెంట్ నెం.528, డోర్ నెం.2-173 గల నివాసిత ఇంటి మొత్తం భాగం, దిగువ సరిహద్దులు కలిగియున్నది: ఉత్తరం:కొండూరు బుజ్జీ ఆస్తి, దక్షిణం: ఐలపూలు పిచ్చమ్మ ఆస్తి, తూర్పు: రోడ్డు, పడమర:ఆనంద్ చర్చ్. కొలతలు: సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా నందిగామా మరియు రిజిస్ట్రేషన్ జిల్లా క్రిష్ణ లిమిట్స్‌లోపు విస్తీర్ణం: ఎక 0.03 సెంట్లు 230 స్వేర్ లింకు లేదా 156.332 చ.గ.లు లేదా 130.693చ.మీ.లు.	29-05-2023 & 759434	06-10-2023

తేది: 09-10-2023 ప్రదేశం : ఆం.ప్ర
ధీకృత అధికారి, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్.

శాఖా కార్యాలయం : రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కెడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034. కార్పొరేట్ మరియు నమోదిత కార్యాలయం : రూబీ టవర్, 11వ అంతస్తు, నార్త్ వెస్ట్ వింగ్, ప్లాట్ నం.29, జె.కె.సావంత్ మార్గ్, దాదర్, ముంబై-400028.

అమ్మకం కం వేలం నోటీసు

ఏదైతే, తేది 7 జూన్, 2019న ఆర్‌బిఐ సర్క్యులర్ నం.ఆర్‌బిఐ/2018-19/203, డిబిఆర్.నం.బిపి.బిసి.45/21.04.048/2018-19 యొక్క షరతులలో దీని లెండర్ల ద్వారా రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) యొక్క ఆమోదించబడిన రిజల్యూషన్ ప్లాన్‌కు అనుగుణంగా ఒత్తిడితో కూడిన ఆస్తుల పరిష్కారం కొరకు ప్రుడెన్షియల్ ఫ్రేమ్ వర్క్, తేది 3 మార్చి, 2023న గౌరవనీయులైన సుప్రీమ్ కోర్ట్ ఆఫ్ ఇండియా యొక్క ఆర్డర్ మరియు 25 మార్చి, 2023న షేర్ హోల్డర్లు ఆమోదించిన ప్రత్యేక తీర్మానం ప్రకారం, ఆర్‌సిఎఫ్‌ఎల్‌ఎల్ తన వ్యాపారాన్ని తిరోగమన విక్రయం ద్వారా రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్‌ఎల్)కి బదిలీ చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. మరియు ఏదైతే, రుణగ్రహీత రుణ ఖాతా(ల)కు సంబంధించిన అన్నీ హక్కులు మరియు బాధ్యతలు కూడా ఆర్‌సిఎఫ్‌ఎల్ కి బదిలీ చేయబడ్డాయి.
దిగువసంతకందారు అయిన రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్‌ఎల్) యొక్క అధికృత అధికారి ఆర్‌సిఎఫ్‌ఎల్ యొక్క క్రింద పేర్కొన్న సెక్యూర్డ్ డెబ్స్ రికవరీ కొరకు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 క్రింద దిగువ పేర్కొన్న రుణగ్రహీల ప్రత్యేకంగా క్రింద పేర్కొన్న ఆస్తుల కొనుగోలు కొరకు టెండర్లు/కోట్స్‌ను ఆహ్వానిస్తున్నారు. ప్రతిపాదిత ఆస్తులు "ఎక్కడ ఉందో అక్కడే" మరియు "ఆధారం ఉన్నట్లే" మరియు ఆధారం లేకుండా ప్రాతిపదికన విక్రయం నిర్వహించబడుతుంది.

క్ర. సం.	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారుల పేరు మరియు చిరునామా	ఏ ఆస్తి విక్రయించబడుతుందో దాని బకాయి రికవరీ కొరకు	రిజర్వు ధర (ఆర్‌పి), ధరావత్తు డిపాజిట్ మొత్తం (ఇఎమ్‌డి), తనఖీ తేది	వేలం తేది, సమయం మరియు వేదిక/ కోట్స్/బిడ్స్ ప్రారంభం
1.	1. తల్లం లక్ష్మీపద్మ ప్రియ అంజనిదేవి, చిరునామా: 3-28-41/ఎ, శ్రీ వెంకటేశం అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నం.1, 3వ లైన్, బృందావన్ గార్డెన్స్, గుంటూరు-522007. 2. టి.ఉమాశంకర్ గుప్తా, 3. మాజేటి దుర్గావీర హనుమాన్, 4. మెసెర్స్.కుబేర ఇండస్ట్రీస్, 5. మెసెర్స్. భారతి ఫుడ్ ప్రొడక్ట్స్ 6. మాజేటి శ్రీవాసవి 7. గాయత్రి కాస్ట్‌లెస్ ప్రైవేట్ లిమిటెడ్, చిరునామా : డో.నం.5-62-6, టి.ఎస్.నం.18/4ఎ, 28/1బి, 18/5, పాత మున్సిపల్ వార్డు నం.2, కొత్త వార్డు నం.3, బ్లాక్ నం.1, 1వ లైన్, మున్సిపల్ పాత మూల్యాంకనం నం.3656, కొత్త మున్సిపల్ నం.12451, పండరీపురం, గుంటూరు-522002.	18 సెప్టెంబర్, 2023 నాటికి రూ.1,39,20,206/- (ఒక కోటీ ముప్పై తొమ్మిది లక్షల ఇరవై వేల రెండు వందల ఆరు రూపాయలు మాత్రమే)	రిజర్వు ధర : రూ.1,74,00,000/- (ఒక కోటీ డెభై నాలుగు లక్షల రూపాయలు మాత్రమే) ధరావత్తు డిపాజిట్ మొత్తం : రూ.17,40,000/-, తనఖీ తేది : 16 నవంబర్, 2023, ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. మధ్య	20 నవంబర్, 2023, ఉ.11.00 గం. రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కెడ్, బేరింగ్ నం. 6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.
	ఆస్తి/సెక్యూరిటీ ఇంట్రస్ట్ వివరాలు : రెసిడెన్షియల్ ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.5-62-6లో ఉన్న, టి.ఎస్.నం.18/4ఎ, 28/1బి, 18/5, పాత మున్సిపల్ వార్డు నం.2, కొత్త వార్డు నం.3, బ్లాక్ నం.1, 1వ లైన్, మున్సిపల్ పాత మూల్యాంకనం నం.3656, కొత్త మున్సిపల్ మూల్యాంకనం నం.12451, పండరీపురం, గుంటూరు-522002.			
2.	1. దేసు వంశీకృష్ణ, చిరునామా : డో.నం.13/07/317, జిఎమ్‌సి-323, కృష్ణానగర్ 6వ లైన్, కుందుల రోడ్డు వద్ద వైట్ హౌస్ అపార్ట్‌మెంట్, లేన్ గుంటూరు ఎదురు, గుంటూరు-522006. 2. సత్యనారాయణ దేసు, చిరునామా : ఫ్లాట్ నం.402, 3వ అంతస్తు, హరివిల్లు అపార్ట్‌మెంట్, డో.నం.128/1ఎ ఫ్లాట్ నం.1,2 మరియు 3 ఇన్నర్ రింగ్ రోడ్డు, అగర్తవరప్పాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522001.	21 సెప్టెంబర్, 2023 నాటికి రూ.48,05,349.42/- (నలభై ఎనిమిది లక్షల ఐదు వేల మూడు వందల నలభై తొమ్మిది రూపాయల నలభై రెండు పైసలు మాత్రమే)	రిజర్వు ధర : రూ.29,80,000/- (ఇరవై తొమ్మిది లక్షల ఎనభై వేల రూపాయలు మాత్రమే) ధరావత్తు డిపాజిట్ మొత్తం : రూ.2,98,000/- (రెండు లక్షల తొంభై ఎనిమిది వేల రూపాయలు మాత్రమే) తనఖీ తేది : 16 నవంబర్, 2023 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. మధ్య	20 నవంబర్, 2023, ఉ.12.00 గం. రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కెడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.
	ఆస్తి/సెక్యూరిటీ ఇంట్రస్ట్ వివరాలు : రెసిడెన్షియల్ ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ హరివిల్లు అపార్ట్‌మెంట్, 3వ అంతస్తు, ఫ్లాట్ నం.402 వద్ద ఉన్న డో.నం.128/1ఎ, ఫ్లాట్ నం.1,2 మరియు 3 ఇన్నర్ రింగ్ రోడ్డు, అగర్తవరప్పాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522001.			
3.	1. గీతాభవాని సింధియ, చిరునామా : డో.నం.20-3/1-48సి/ ఎఫ్‌ఎఫ్, పద్మావతి రెసిడెన్స్, ఫ్లాట్ నం.4ఎఫ్2 ఆర్.ఎస్.నం.97/7, వార్డు నం.21/4 కొత్త మూల్యాంకనం నం.455099, అయోధ్యనగర్, విజయవాడ-520003. 2. ఎస్.కళ్యాణ చక్రవర్తి, చిరునామా : డో.నం.20-3/1-48సి/ఎఫ్‌ఎఫ్, ఆర్.ఎస్.నం.97/7, వార్డు నం.21/4 కొత్త మూల్యాంకనం నం.455099, అయోధ్య నగర్, విజయవాడ-520003.	20 సెప్టెంబర్, 2023 నాటికి రూ.50,01,588.60/- (యాభై లక్షల ఒక వేల ఐదు వందల ఎనభై ఎనిమిది రూపాయల అరవై పైసలు మాత్రమే)	రిజర్వు ధర : రూ.25,00,000/- (ఇరవై ఐదు లక్షల రూపాయలు మాత్రమే), ధరావత్తు డిపాజిట్ మొత్తం : రూ.2,50,000/-, తనఖీ తేది : 16 నవంబర్, 2023, ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. మధ్య.	20 నవంబర్, 2023, ఉ.01.00 గం. రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కెడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.
	ఆస్తి/సెక్యూరిటీ ఇంట్రస్ట్ వివరాలు : రెసిడెన్షియల్ ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.20-3/1-18సి/ఎఫ్‌ఎఫ్ లో ఉన్న పద్మావతి రెసిడెన్స్, ఫ్లాట్ నం.4ఎఫ్2, ఆర్.ఎస్.నం.97/7, వార్డు నం.21/4 కొత్త మూల్యాంకనం నం.455099, అయోధ్య నగర్, విజయవాడ-520003.			

గమనిక : ఎఓ అతని/ఆమె అభీష్టానుసారం మొదటి మూడు బిడ్డర్లలో ఇంటర్-సీ బిడ్డింగ్‌ను అనుమతించవచ్చు.
2) సీల్డ్ కొటేషన్లు/బిడ్లు సమర్పణ చివరి తేది మరియు ప్రదేశం : 17 నవంబర్, 2023 సా.5.00 గం. న లేదా అంతకు ముందు. బిడ్లు పంపించాల్సిన చిరునామా : అధీకృత అధికారికి, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కెడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.
సంప్రదించాల్సి వ్యక్తి : శ్రీ.కోదండరాములు ఎ.-ఫోన్ : 9052003980

షరతులు మరియు నిబంధనలు:
ఆసక్తిగల పార్టీలు తమ కొటేషన్/బిడ్‌ను సీల్డ్ కవర్‌లలో "ఆస్తి కొనుగోలు కొరకు కొటేషన్"- (ఆస్తి చిరునామా), ధరావత్తు డిపాజిట్ మొత్తం (ఇఎమ్‌డి) తో పాటు పే ఆర్డర్/డిడి ద్వారా "రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్..", హైదరాబాద్ కు అనుకూలంగా డ్రా చేసి పంపవచ్చు/సమర్పించవచ్చు.
1. ఇఎమ్‌డి ఎటువంటి వడ్డీని కలిగి ఉండదు, విజయవంతమైన పార్టీల విషయంలో సర్దుబాటు చేయబడుతుంది మరియు అటువంటి పార్టీ డిఫాల్ట్ అయితే జప్తు చేయబడుతుంది.
2. టెండర్లు/బిడ్ల ఏ విషయంలోనైనా అసంపూర్తిగా లేదా సంతకం చేయనివి లేదా అవసరమైన ఇఎమ్‌డి కొరకు డిడి/పిఓతో పాటు లేనివి ఎఓ యొక్క స్వంత అభీష్టానుసారం సారాంశంగా తిరస్కరించబడతాయి.
3. పైన పేర్కొన్న ఆస్తి పైన పేర్కొన్న రిజర్వు ధరల కంటే తక్కువగా విక్రయించబడదు.
4. విజయవంతమైన పార్టీ కోట్ చేసిన మొత్తంలో 25% డిపాజిట్ చేయాలి, అందులో డిపాజిట్ చేసిన ఇఎమ్‌డి కూడా ఉంటుంది, అదే రోజున పే ఆర్డర్ / డిడి ద్వారా "రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్..", హైదరాబాద్‌లో చెల్లించాలి మరియు మిగిలిన 75% అమ్మకం యొక్క నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోపు లేదా దిగువ సంతకం చేసిన వ్రాతపూర్వకంగా అనుమతించబడిన పొడిగించిన వ్యవధిలోపు డిపాజిట్ చేయబడుతుంది. ఎఓ అతని/ఆమె స్వంత విచక్షణతో చెల్లింపులు చేయడానికి సమయాన్ని వ్రాత పూర్వకంగా పొడిగించవచ్చు. నిర్ణీత తేదీలలోగా అవసరమైన చెల్లింపులు చేయడంలో విఫలమైతే, ఇఎమ్‌డి మరియు అప్పటి వరకు చెల్లించిన అన్ని మొత్తాలు ఎటువంటి నోటీసు లేకుండా జప్తు చేయబడతాయి మరియు ఆస్తులు తిరిగి విక్రయించబడతాయి.
5. అటువంటి చెల్లింపులన్నీ కేవలం హైదరాబాద్‌లో చెల్లించదగిన రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు అనుకూలంగా డ్రా చేయబడిన పే ఆర్డర్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో మాత్రమే చేయాలి.
6. విజయవంతమైన పక్షం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, పన్నులు, లెవీలు మొదలైనవి చట్ట ప్రకారం వర్తించే విధంగా విక్రయం/రవాణా కోసం చెల్లించాల్సిన ఛార్జీలు/ఫీజులు మరియు ఇతర ఖర్చులను కూడా భరిస్తుంది.
7. ప్రభుత్వానికి ఎలాంటి ఛార్జీ, తాత్కాలిక హక్కు, భారం, ఆస్తి పన్ను లేదా ఇతర బకాయిలకు లేదా విక్రయించబడుతున్న ఆస్తులకు సంబంధించి దేనికైనా ఎఓ బాధ్యత వహించదు.
8. ఆఫర్‌లో మెరుగుదల కోసం అత్యధిక బిడ్డర్‌తో చర్చలు జరపడానికి ఎఓ తన హక్కును కలిగి ఉన్నాడు మరియు ఏదైనా కొటేషన్‌ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి లేదా ఎటువంటి కారణం చూపకుండా వేలం/విక్రయాన్ని వాయిదా వేయడానికి/వాయిదా వేయడానికి/రద్దు చేయడానికి సంపూర్ణ హక్కును కలిగి ఉన్నారు.
9. అమ్మకం ఆర్‌సిఎఫ్‌ఎల్ ద్వారా నిర్ధారణకు లోబడి ఉంటుంది.
10. రుణగ్రహీత వేలం/విక్రయ నిర్ధారణ తేదీకి ముందే ఆర్‌సిఎఫ్‌ఎల్‌కి చెల్లించాల్సిన మొత్తాన్ని పూర్తిగా చెల్లిస్తే, వేలం/విక్రయం నిలిపివేయబడుతుంది.
11. ఎఓ యొక్క ఉత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు, పైన పేర్కొన్న లక్షణాలపై ఎటువంటి ఇతర భారం లేదు.
12. బిడ్ బదిలీ చేయబడదు.
13. ఈ ప్రచురణ రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలకు బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించనట్లయితే, పైన పేర్కొన్న తేదీలో విక్రయాన్ని నిర్వహించాలనే ఉద్దేశ్యంతో 30 రోజుల నోటీసు. రుణగ్రహీత ఏదైనా వ్యక్తికి ఆస్తులను ప్రైవేట్ అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా విక్రయించే ప్రతిపాదనను కలిగి ఉంటే, దానిని 7 రోజులలోపు దిగువ సంతకం చేసిన వారికి తెలియజేయవచ్చు.

సర్ఫేసీ యాక్ట్, 2002 క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు
రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు బిడ్ తెరిచే తేదీకి ముందే మొత్తం బకాయిలు చెల్లించాలని గమనించారు, ఆ సెక్యూర్డ్ అసెట్‌లు వేలం వేయబడతాయి మరియు బ్యాలెన్స్ ఏదైనా ఉంటే, మీ నుండి వడ్డీ, ఖర్చు మరియు ఛార్జీలతో తిరిగి పొందబడుతుంది.

ప్రదేశం : విజయవాడ,
తేది : 06.10.2023
(అధీకృత అధికారి)
రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్

AXIS BANK LIMITED
రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డో.నం.5-2-183/184, 3వ అంతస్తు, ఆర్.పి.రోడ్డు, సికింద్రాబాద్.

రూల్ 8(1) క్రింద లాంఛనప్రాయ స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారుడు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్ గా పేర్కొనబడినది) "త్రిశూల్", సమర్తేశ్వర్ గుడి ఎదురు, లా గార్డెన్ వద్ద, ఎలిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద దీని నమోదిత కార్యాలయం ఉంది. ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం డో.నం.5-2-183/184, 3వ అంతస్తు, ఆర్.పి.రోడ్డు, సికింద్రాబాద్ యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు :

క్ర. సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు, హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	తనఖాకు సమానంగా ఆఫర్ చేయబడిన ఆస్తులు మరియు స్వాధీనత తేది
1	1) మెసెర్స్. ఎపిజె ఇంపెక్స్, దీని పాట్నర్స్, శ్రీ. నేరెళ్ల మురళి మోహనకృష్ణ మరియు శ్రీ.పాలంకి శివ నాగిరెడ్డి ద్వారా ప్రాతినిధ్యం, ఫ్లా.నం.7-1-618/కెజె/02, గ్రౌండ్ ఫ్లోర్, కంచంజుంగ అపార్ట్‌మెంట్స్, ఆదిత్య ఎన్‌క్లేవ్, అమీర్‌పేట, సర్కిల్ నం.26, హైదరాబాద్, తెలంగాణ-500016. 2. శ్రీ.నేరెళ్ల మురళి మోహనకృష్ణ, తండ్రి. శ్రీ.నేరెళ్ల చిన్న రాఘవయ్య, నివాసం : 1-2-228/4, ఫ్లాట్ నం.303, అవలోన్ రైడ్ అపార్ట్‌మెంట్స్, నాగేశ్వర నగర్, కొత్తపేట, రోడ్డు నం.2, కె.వి.రంగారెడ్డి, సరూర్ నగర్, తెలంగాణ-500035. ఇక్కడ కూడా : శ్రీ.నేరెళ్ల మరళీ మోహనకృష్ణ, తండ్రి. శ్రీ.నేరెళ్ల చిన్న రాఘవయ్య, కేరాఫ్.1-454, కొత్తపేట, మంగళగిరి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522503. ఇక్కడ కూడా : శ్రీ.నేరెళ్ల మరళీమోహన కృష్ణ, తండ్రి. శ్రీ.నేరెళ్ల చిన్న రాఘవయ్య, నివాసం : ఫ్లాట్ నం.304, జూపిటర్ అపార్ట్‌మెంట్, చిన్న కాకాని గ్రామం, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503. 3. శ్రీ.పాలంకి శివనాగిరెడ్డి, తండ్రి. వెంకట కృష్ణారెడ్డి, నివాసం : ఫ్లాట్ నం.101, సాయి బాలాజీ కాస్ట్‌లే, రోడ్డు నం.7, కొత్త నాగోల్ కాలనీ, కొత్తపేట, కె.వి.రంగారెడ్డి, సరూర్ నగర్, తెలంగాణ-500035. ఇక్కడ కూడా : శ్రీ.పాలంకి శివనాగిరెడ్డి, తండ్రి. 2-136, పల్లగిరి కృష్ణ, నందిగామ మండలం, ఆంధ్రప్రదేశ్-521185. ఆస్తి చిరునామా : శ్రీ.నేరెళ్ల మురళి మోహన కృష్ణ, తండ్రి. శ్రీ.చిన్న రాఘవయ్య, నివాసం : ఫ్లాట్ నం.102, గ్రౌండ్ ఫ్లోర్, జూపిటర్ అపార్ట్‌మెంట్స్, చిన్నకాకాని, మంగళగిరి, గుంటూరు జిల్లా, పిన్‌కోడ్ : 522503. డిమాండ్ నోటీసు తేది: 07-06-2023 ఎల్ఎఎన్ ఎకౌంట్ నెం. 921030049922038	రూ.2,56,33,954.02/- (రెండు కోట్ల యాభై ఆరు లక్షల ముప్పై మూడు వేల తొమ్మిది వందల యాభై నాలుగు రూపాయల రెండు పైసలు మాత్రమే) 30.04.2023 నాటికి ఉన్న బకాయి మొత్తం మరియు 29.04.2023	గుంటూరు జిల్లా, మంగళగిరి, చిన్న కాకాని గ్రామం, మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ మరియు మంగళగిరి ఎస్ఆర్ఓ అధికార పరిధి, ఎస్ఆర్ఓ మంగళగిరి (ఆర్.ఓ) ముందు వైడ్ రిజిస్టర్డ్ ఆబ్సల్యూట్ సేల్ డీడ్ బేరింగ్ డాక్.నం.7835/2021 మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ శ్రీ.నేరెళ్ల మురళీ మోహనకృష్ణ, తండ్రి. శ్రీ.చిన్న రాఘవయ్య పేరు మీద ఉన్న 'జూపిటర్' పేరుతో ఉన్న అపార్ట్‌మెంట్ భవనం యొక్క గ్రౌండ్ ఫ్లోర్ లో రెసిడెన్షియల్ ఫ్లాట్ నం.102 ఉన్న కార్పెట్ ఏరియా 952 చ.అ.లు. మొత్తం విక్రయించదగిన ఏరియా 1340 చ.అ.లు. (బాల్కానీలు, సర్వీస్ ఏరియాలు మరియు కామన్ ఏరియాలలో అనుపాతం వాటా) తో పాటు స్టిల్ట్ ఫ్లోర్‌లో కార్ పార్కింగ్ ప్రదేశం కొలిచే 120 చ.అ.లు. మొత్తం నుండి బయట స్థలం కొలిచే 01 ఎకరాలు 03 సెంట్లు. (4162.4 చ.గ.లు. లేదా 3496.416 చ.మీ.లు.) బేరింగ్ డో.నం.51/సి మరియు ఫ్లాట్ సరిహద్దులు : తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: కామన్ కారిడార్, దక్షిణం: లిఫ్ట్ మరియు ఓపెన్ టు స్కై. స్వాధీనత తేది : 06-అక్టోబర్-2023

తేది: 09.10.2023
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

"అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినవాడు
నాకు ఆరాధ్యుడు "

– కాళోజీ

వామనులమే.. మూడడుగుల వారమే...

నిజమే నేను అందవిహీననే
ముఖపద్మం మీదకి ఈదుకుంటూ
మెరిసే మీనాలు రాలేవు
శ్వాసించేందుకు పచ్చ సంపెంగ నాసిక
నీలాకాశం మీద విచ్చుకోలేదు
నలుగురిలో కళ్ళల్లోకి ధైర్యంగా చూసేంత ఎత్తులో
తలెత్తి మాట్లాడటానికి
అందమైన పెదవులు కూడా లేని
భూమికి మూడడుగుల వామనలమే
అవును మరుగుజ్జులమే!

ఆడదానిలా గాజులు తొడుక్కుని లేమని
అహంకార మగగొంతు మైకుల్లోంచి గర్జిస్తే
మహిళా సమూహాల ర్యాలీలు జరుగుతాయి
ఏ కులాన్నో మతాన్నో
అధికారమదపు విశ్వరూపం
మాటలతోనే అవమానకరంగా
భూస్థాపితం చేయాలనుకుంటే
రెండోరోజే ప్రయాణ సాధనాల అస్థిపంజరాలు
గోడౌన్ సమాధిలో నిద్రిస్తాయి
నగరాల పట్టణాల జీవితాలు
జీవించటం మర్చిపోతాయి!

కానీ మేమో
మూడడుగుల చిన్ని ప్రాణాలం కదా
ఆజానుబాహుల ప్రపంచంలో
మైనార్టీ సంఖ్యలం కదా
అందుకే కదా
మరుగుజ్జులతో పోటీ ఏమిటనీ
అంత ధైర్యంగా అనగలిగారు!

కానీ, ఒక్కటి మాత్రం నిజం
నేలకి దగ్గరగా ఉన్నందున
భూమ్యాకర్షణ శక్తిని పీల్చుకున్న
మా గుండెకి బలమెక్కువ
మా మెదడుకు తెలివీ ఎక్కువే
భూమికి లాగే సహనము ఎక్కువే!

అయితే తొలిచేస్తుంటే భూమి
మౌనంగా చూస్తూ ఉండటం లేదు
సమయం చూసి ఫెటేల్మనీ విచ్చుకునీ
మీరు కూడబెట్టిన ఆస్తుల్నీ
మిమ్మల్నీ కూడా మింగ గలదు.
అలాగే ఏదో ఒకనాడు
మరుగుజ్జులమైన మేమూ అంతే!

– శీలా సుభద్రాదేవి
81068 83099

మనిషి కావాలి!

దునియాని మార్చేదానికి
దేవుడెందుకబ్బా..!
ఒక్క మనిషినివ్వండి చాలు
మానవత్వం మినహా
మరే క్వాలిఫికేషన్ ఉండటానికి వీల్లేదు
బతుకు తరగతి గదులు
ఒక్కొక్కటీ దాటుకొస్తున్నా
స్వార్థం సిలబస్ తెలియని
ఒక్క మనిషి చాలు

పురాణాలు జీవ నదులైతే ఏంటి
పురుగుల తట్టయితే ఏంటి
పులుకడిగిన ముత్యంలాంటి
మనిషొకడు కావాలిప్పుడు !

పొరుగువాణ్ణి ప్రేమించడానికి
ఇతిహాసాల్ని ఎత్తుకు తిరగాలా!?
స్పందించాలే గానీ
మనసే మందిరమని చూపగలిగేవాడు
గాలికీ కాలానికీ ముడివేసి
ఒకే కొమ్మకి నవ్వులూ పువ్వులూ
పూయించగలిగేవాడు
తల్లడిల్లే మనసుకీ
చెమ్మగిల్లే కంటికీ
ఓదార్పునిచ్చే గుణం గలవాడు
ఎవడైనా పర్లేదు
ఒక్క మనిషినివ్వండి చాలు !

దేవుడి గురించి
గొప్పగా చెప్పుకోటానికేముంది
మహా అయితే మనిషి చేసినవాడు
అసలు దేవుడితో పనిలేదు
మనిషి కావాలిప్పుడు

లోకం ఒట్టిపోయిన లొట్టిపిట్టలా వుంది
యుగాలుగా అదే నడక
ఒక్క నవ్వుతో వెయ్యి యుగాలు
దాటించగలవాడు
ఆడబిడ్డని ఒంటిసబ్బులా కాక
కంటిపాపలా చూడగలవాడు
అవసరమైతే నిన్నూ నన్నే కాదు
తనను తాను కడిగి ఆరెయ్యగలిగేవాడు
ఒక్కడు చాలు !

– బంగార్రాజు కంఠ
85003 50464

15న రొట్టమాకు రేవు కవిత్వ అవార్డు సభ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్టోబర్ 15, ఆదివారం సాయంత్రం 6 గంటలకు, రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. అవార్డు గ్రహీతలు : షేక్ మహమ్మద్ మియా స్మారక అవార్డు – ప్రసేన్/ ఎవరికి వర్తిస్తే వారికి; పురిటిపాటి రామిరెడ్డి స్మారక అవార్డు – పెనుగొండ సరసిజ/ ఇక మారాల్సింది నువ్వే!; కెఎల్ నర్సింహారావు స్మారక అవార్డు – తెలుగు వెంకటేష్/ తూనీగతో సాయంకాలం, సుంకర గోపాలయ్య/ మా నాయిన పాట. సభలో అతిథులుగా కె. శివారెడ్డి, గోరటి వెంకన్న, జూలూరు గౌరీశంకర్, మామిడి హరికృష్ణ, జి. లక్ష్మీనరసయ్య పాల్గొంటారు.

– కవి యాకూబ్, శిలాలోలిత

మనసును కదిలించే నాటకకర్త



ఈ ఏడాది నోబెల్ సాహిత్య బహుమతి విజేత నార్వే రచయిత జాన్ ఫాసే. ఇప్పటివరకూ ఆయన రాసిన నవలలు, కవితలు, పిల్లల కోసం రాసిన పుస్తకాలు, వ్యాసాలు, నాటకాలు– అన్నీ కలిపి 75 వరకూ ఉన్నాయి. హేన్రిక్ ఇబ్సన్ తర్వాత నార్వేలో రెండవ సుప్రసిద్ధ నాటకకర్తగా ఫాసే కీర్తి పొందాడు. ప్రపంచవ్యాప్తంగా 1000 పైగా వివిధ రంగస్థలాలపై తన నాటకాలు ప్రదర్శితం అయ్యాయి. అలా ఫాసే ప్రపంచ రంగస్థలం మీద ఎక్కువ సార్లు, ఎక్కువ చోట్ల ప్రదర్శించిన నాటకర్తగా గుర్తింపు పొందాడు.

మినిమలిజం ధోరణిలో లోతుగా ఆత్మావలోకనం చేయిస్తాయి ఫాసే రచనలు. అతడి రచనా శైలి గేయాత్మక వచనం, కవిత్వ పంథాలో ఉంటాయి. ఇబ్సన్ ప్రదర్శనా శైలిని, ఆధునిక వర్తమానంలో కొనసాగింపుగా ఫాస్సే నాటక రచనను చెప్పుకోవచ్చు. అందుకే ఫాసేని ఆధునిక ఇబ్సన్‌గా ముద్దుగా పిలుచుకుంటారు. వీరి ప్రదర్శనలను పోస్టు డ్రామెటిక్ థియేటర్‌గా విమర్శకులు పేర్కొంటుంటారు. అప్రకటిత మూగ స్వరాలకు ఫాసే తన గొంతును ఎరువిచ్చాడు అంటారు. ఫాస్సే నోబెల్ సాహిత్య పురస్కారం పొందిన నాల్గవ నార్వేజియన్. ఈ సంవత్సరం నోబెల్ బహుమతి విలువ 11 మిలియన్ స్వీడిష్ క్రోనార్లు. మన రూపాయల్లో రూ. 8.35 కోట్లు.

1995కు ముందే ఫాసే తన మొదటి నాటకం రాశారు. 1995, 1998, 2002, 2004లో నైట్ సాంగ్స్, డ్రీమ్ ఆఫ్ ఆటమ్, డెత్ వేరియేషన్స్ మొదలైనవి రాశారు. ఇవి భావోద్వేగపరమైనవిగా, సామాజిక వైచిత్రి, దైవానుభూతి పరమైనవి, అధునాతన కళాత్మక ప్రక్రియల ద్వారా కొత్త రకమైన భాషాభివ్యక్తితో తీర్చిదిద్దబడినవిగా విశ్లేషకులు భావిస్తారు. ఫాసేపై వెస్సాస్ బెకెట్ బెర్నర్డ్ ట్రకేల ప్రభావం ఉందంటారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన నాటక సప్తకం 2012లో రాసిన 'ఏ న్యూ నేమ్'గా విశ్లేషకులు పేర్కొంటారు. ఈ నాటకాలు ... వయసు పైబడుతున్న ఓ సృజనకారుడు తన లోపలి మనిషితో ముఖాముఖిగానూ, మానవీయ పరిస్థితులతో దైవంతో సంవాదం గానూ ఉంటాయని, అవి జీవితంలో నిర్భీతిని ప్రతిఫలించేవిగా ఉంటాయని చెబుతారు. ఫాసే తన జీవితాన్ని, రచనలను ప్రభావితం చేసిన వారి(టి)లో హాజ్, ఫ్రాంజ్ కాఫ్కా, విలియం ఫాక్నర్, వర్జీనియా ఊఫ్‌తో పాటు చివరగా బైబిల్ కూడా అని ఆయన చెబుతారు. ప్రపంచంలో జీవించి ఉన్న మొదటి వందమంది మేధావుల్లో ఫాసే స్థానం 83 అని ఒక సంస్థ పేర్కొంది. 2011లో ఆస్లో నగరంలోని రాయల్ ప్యాలెస్ ఆవరణ సమీపంలో నార్వే ప్రభుత్వం 'గ్రోటెన్' గౌరవనీయ ఆవాసాన్ని ఫాసేకు కల్పించింది. నార్వేజియన్ కళా సంస్కృతులకు, ఫాస్సే అనుదానాన్ని గుర్తించిన నార్వే రాజు, గ్రోటెన్ని శాశ్వత ఆవాసంగా వినియోగించుకోవడానికి ఫాస్సేకు అనుమతి ఇచ్చాడు. 2015లో తన రచనాత్రయం 'వేక్ ఫుల్ నెస్', 'ఒలావ్స్ డ్రీమ్స్', 'వీయరినెస్'గాను నార్డిక్ కౌన్సిల్ వారి సాహిత్య బహుమతిని కూడా పొందాడు.

ఫాసే రచనలను పర్షియన్ భాషలోకి మొహమ్మద్ హమీద్ ద్వారా అనువదించగా, తెహరాన్‌లోని ప్రధానమైన రంగస్థల వేదికలపై నాటకాలు ప్రదర్శింపబడ్డాయి. ఫాసే నాటకాలను సారా కెమెరాన్ సండ్ ఇంగ్లీషులోకి అనువదించారు. అవి న్యూయార్క్, పిట్స్‌బర్గ్‌లోని కళావేదికలపై ప్రదర్శింపబడ్డాయి.

2022లో ఫాస్సే నవల– అతడి రచనా సప్తకంలో 6, 7 భాగాలను డామియోన్ సీర్ల్స్ ఆంగ్లంలోకి అనువదించారు. 'న్యూ నేమ్' పుస్తకం 2023 నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డు (ఫిక్షన్ విభాగం) తుది ఎంపికలో ఉంది. 'ఐ యామ్ ద విండ్' అనే అస్తిత్వవాద నాటకంలో– ప్రధానంగా ఒక చేపల పడవలోని ఇద్దరి మధ్యే కథ నడుస్తుంది. ఫాసే పాత్రలు, సాధారణ ప్రజానీకం, సామాజిక జీవితానికి వెలిగా ఉండే వారికి.. నిత్యజీవితంలో ఎదురయ్యే సవాళ్లను కష్టాలను ఎదిరించగల ధైర్యాన్ని ఇస్తాయి. రచయితకు, పాత్రలకు మధ్య, వెచ్చని అనుబంధం కొనసాగుతూ వారిలోని మానవత్వాన్ని ఎత్తిచూపుతాయి. 'ఇతివృత్తాల కోసం అయితే నా రచనలు చదవనవసరం లేదు' అనే ఫాసే – 1983లో సాహిత్యంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. తరువాత మొట్టమొదటి నవల 'రెడ్ అండ్ బ్లాక్' రాశాడు. తరువాత మూడు సంపుటాల్లో 1250 పేజీలతో సాగింది. ఒక్కచోట కూడా విరామ చిహ్నం లేకుండా సాగిపోతుంది.

ఫాసే ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న 1990 ప్రాంతాల్లో ఎవరో, "నువ్వు నాటకాలు ఎందుకు రాయకూడదు?" అని అన్నారట. "అప్పుడే తెలుసుకున్నాను– నాటక రచన నా కోసమే వేచి ఉంది." అని ఫాసే ఇప్పుడు ఆరోజును గుర్తు చేసుకుంటారు. ఆ తరువాత నుంచి నాటకాలు రాయడం మొదలు పెట్టాడు. తన వచనం, రచనా శైలి, ప్రదర్శన పోకడలతో ఈరోజు ప్రపంచంలోనే అత్యధిక ప్రదర్శనలు ఇచ్చిన నాటక రచయితగా నిలిచాడు. తను ఒక ప్రయాణంలో ఉండగా, నోబెల్ అకాడమీ బాధ్యుడు ఒకరు ఫోన్ చేసి బహుమతి విషయం చెప్పగానే "అయితే, నేను ఇంకా జాగ్రత్తగా డ్రైవ్ చేసుకుంటూ ఇంటికి వెళ్తాను" అన్నాడట. నోబెల్ బహుమతి తనకు వస్తుందని ఎన్నోసార్లు అనుకున్నా, నిజంగా ఆ వార్త విన్నప్పుడు మాత్రం సరికొత్తగా ఆశ్చర్యపోయాడట!

భాష విషయానికి వస్తే ... డెన్మార్కులో 400 ఏళ్లగా ఉన్న భాషలో కాకుండా, నార్వే జనాభాలో 10 శాతం మంది మాత్రమే మాట్లాడే నార్వే పశ్చిమ ప్రాంతంలోని గ్రామీణ ప్రాంత మాండలిక భాష తనది. అందువల్లనే తన నాటక ప్రదర్శనలు వేయి విధాలుగా రంగస్థలానువాదాలుగా ప్రాచుర్యం పొందాయి" అని అభిప్రాయపడతాడు.

చిన్నప్పుడు కలిగిన ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడిన తర్వాత రాక్ బ్యాండ్‌ని ఇష్టపడ్డ ఫోసే, చావు బతుకుల మధ్య కొట్లాడి బయటపడ్డాక, రచనా వ్యాసాంగంపై దృష్టి నిలిపాడు. ఇప్పటికీ వివిధ ప్రక్రియల్లో 75 పైగా రచనలు చేసినా, అందులో సగభాగం నాటక రచనలే ఉంటాయి. "పరిస్థితులు అంధకార బంధురంగా, చీకట్ల గుయ్యారంగా ఉన్నప్పుడే నువ్వు వెలుగును చూడగలవు" అన్నట్లు తన రచనా సప్తకంలో ఒక్క వాక్యానికి కూడా విరామం ఇవ్వకుండా పాఠకుడ్ని తన ఆలోచనా భావధార వెంట ఈడ్చుకుపోతాడు ఫాసే. ఈ ఏకవాక్య, ఏకపాత్ర (మోనోలాగ్)– "కళ, దైవత్వం మధ్య సాగే ఆనందోద్వేగాల ఉద్గారం" అనొచ్చు. ఫ్రెంచ్ దినపత్రిక 'లే మోండే' ఫాస్సేని 21వ శతాబ్దపు బెకెట్ అంటే, కెనడా పత్రిక 'గ్లోబ్ అండ్ మెయిల్' – సమకాలీన నాటక రంగంలో అత్యంత ఎక్కువగా రెచ్చగొట్టే, ఉసిగొలిపే కలం గాలి అని అభివర్ణించింది ఫాసేని.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

సాహిత్య యోధ రాచపాళెం సార్థక స్వర్ణోత్సవం

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి రచనా స్వర్ణోత్సవం సందర్భంగా ఆయన స్నేహితులు, అభిమానులు, విద్యార్థులు కలిసి అభినందన సంచిక తీసుకురావడం సమంజసం, సముచితం. తన రచనలతో చైతన్య దీపాలు వెలిగించిన ఆయన కృషికి యాభై ఏళ్ళు అని పేరు పెట్టడం భావస్ఫోరకం. ఈ సంతోష సందర్భంలో చిరకాల మిత్రులు, విమర్శన రంగంలో ఉద్దండులు అయిన రాచపాళెంకు మన:పూర్వక అభినందనలు తెలుపుతున్నాను. ఆయన నెప్పుడూ ఎస్‌వి రంగారావు గారిలా ఉంటారని నేను అభివర్ణిస్తుంటాను. ఎందుకంటే ఇంటిపేరు లోని గాంభీర్యం రాచపాళెంలో ఉట్టి పడుతుంటుంది. ఎప్పుడో పిహెచ్.డి. చేయడమే గాక తన దగ్గర 25 మందికి డాక్టరేట్, 20 మందికి ఎం.ఫిల్ సాధనలో మార్గదర్శిగా వ్యవహరించినా రాచపాళెం అచ్చమైన తెలుగు పల్లెటూరి ఇంటిపెద్దలా అగుపిస్తారు. సాహిత్యంలో ఎంత ఎదిగినా సౌజన్యం, సంయమనం, సమతుల్యతల మేళవింపులా గోచరిస్తారు. ఒక నిండైన నవ్వు, హాయిగా పలకరింపు, వన్నె తగ్గని మన్నన మర్యాద ఇవి రాచపాళెం సహజ గుణాలు.

విశ్వవిద్యాలయాల్లో దశాబ్దాల పాటు బోధన, పట్టుదలతో పరిశోధన ప్రస్థానంలో ఎన్ని శిఖరాలు అధిరోహించినా రాచపాళెం జీవితం నిత్యశోధనగా సాగే తీరు ప్రత్యక్షంగా చాలాసార్లు చూడగలిగాను. పరిశోధన పద్ధతులు పుస్తకం రాసిన ఆయన నిజంగానే ఏ పదం, ఏ పదార్థం, ఏ పద్ధతి వీటిపై కూలంకషమైన అవగాహన కలిగి పరిపూర్ణమైన ఫలితాల కోసం తపన పడే దీక్షాదక్షుడు. సమగ్రత, స్పష్టత లేకుండా అడుగు వేయరు. ఇంత సాహిత్య కృషి తర్వాత కూడా జిజ్ఞాస తగ్గక పోవడం, జ్ఞానాన్వేషణ ఆగకపోవడం రాచపాళెం వంటి కొందరిలోనే చూస్తాం. అదేం మనకు తెలియనిదా అనే ఉపేక్షాభావన ఆయనలో ఎన్నడూ చూడలేదు. తెలిసిందేదైనా చెప్పేటప్పుడు కూడా నమ్రతగానే చెబుతారు తప్ప జ్ఞాన ప్రదర్శనా కాంక్ష సుతరామూ వుండదు. మిత్రమా! అంటూ ఆయన కంఠం వినిపించిందంటే ఏదైనా రాసి పెట్టమని అడగడమో లేదంటే ఫలానా పాటలో చరణం, తర్వాతి పదం అడగడమో, కాదంటే ఏ వ్యాసంలోనో నేను ఉపయోగించిన పదం, పదబంధం గురించి మెచ్చుకోవడం, కాదంటే ఎందుకలా రాశానని తెలుసుకోవడం చాలాసార్లు అనుభవం. నేను అందరిపైనా ఏవో పదాలతో చమత్కారాలు చేస్తుంటే, ఆయన తెలకపల్లి 'తెలుగుపల్లి' అంటూ నాకూ ఒకటి తగిలించారు. టీవీ చర్చల్లో భిన్నమైంది ఏదైనా వచ్చిందంటే తప్పక స్పందిస్తారు. ఆ విధమైన నిరంతర పరిశీలన తన స్వంతం.

శ్రీశ్రీ రారాను క్రూరమైన విమర్శకుడు అన్నారు. అందుకు పూర్తి భిన్నంగా రాచపాళెం 'సున్నితమైన విమర్శకుడు' అని ఒకసారి రాశాను. వ్యక్తిగా కొంత మొహమాటస్తుడైనా విలువలలో సిద్ధాంతాల్లో రాజీ పడకుండా ఏది ఎంతవరకో అంతే చెప్పడం ఆయన నైజం. చాలాసార్లు విమర్శకులు పాత విషయాల చుట్టూనే పరిభ్రమిస్తూ చరిత్రకారుల్లా మారిపోతుంటారు. నచ్చినవాటి చుట్టూనే తిరుగుతుంటారు. ఈయన మాత్రం నిత్య నూతనంగానూ విస్తృత వైవిధ్యం చూడడానికి ప్రాధాన్యతనిస్తారు. ఎవరో పెద్దవాళ్ళ గురించి చెప్పడం దగ్గరే ఆగిపోరు. పూస్తున్న పూలను, ప్రవహిస్తున్న నీటినీ చూపడానికి ప్రయత్నిస్తారు. అందుకే కొత్త గొంతులు తన ద్వారా ఆవిష్కరణ చేస్తారు. ఎప్పుడూ యువతను, విద్యార్థులనూ, అందులోనూ అణగారిన వర్గాల నుంచి, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ప్రోత్సహించేందుకు ఆసక్తి చూపుతారు. రాయలసీమ గురించిన ప్రత్యేక అధ్యయనం, అనుశీలన సరేసరి. అభ్యుదయ సాహిత్యం మౌలిక విలువలను ఎన్నడూ వదలి పెట్టని విమర్శకులలో రాచపాళెం అగ్రగణ్యులు. ఆ విధంగా ఆయన తెలుగు సాహిత్య విమర్శలో ఒక ఖాళీ రాకుండా చేశారు. ఎక్కడెక్కడి ఎప్పటెప్పటి మంచి రచనలు సేకరించి మళ్ళీ అందించాలని తాపత్రయపడుతుంటారాయన. సాంస్కృతిక రంగంలో పరిణామాలు, సామాజిక శక్తుల చలనాలు కూడా ఆయనకు అమితాసక్తి. తను విమర్శకుడైనా ఇతర విమర్శకులను కూడా అర్థం చేసుకోవడానికి, అందరికీ పరిచయం చేయడానికి ఆరాటపడటం ఆయనలోని వాస్తవికతకు, సహృదయతకూ అద్దం పడుతుంది. భాషా ప్రయోగాలు ఉచ్చారణల్లో భిన్నత్వాన్ని, రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ మాండలికాలనూ ఎంతో లోతుగా అర్థం చేసుకోవడానికి ఎంతో శ్రద్ధ చూపుతారు.

శ్రీశ్రీ సంప్రదాయ కవిత్వం నుంచి సామ్యవాదం వైపు వచ్చినట్టే, రాచపాళెం కూడా ప్రాచీన సాహిత్య విమర్శ నుంచి ప్రజాసాహిత్య పరంపరలోకి వచ్చారు. ఇరవై యేళ్ళ కిందట ప్రస్థానం మలి సంచిక కోసం నేను హరి పురుషోత్తమరావుతో కలసి తనను ఒకసారి ఇంటర్వ్యూ చేయడానికి వెళ్ళినపుడు ఈ విషయం సూటిగా చెప్పడం బాగా నచ్చింది. మేము తనకోసం వెళ్లడంపై ఆయన ఇప్పటికీ నొచ్చుకుంటూ వుంటారు. కానీ నాకు ఇష్టమైన తొలి ముఖాముఖి అది. 'నవ్య సంప్రదాయవాదం, ఆధునికాంతర వాదం రెండూ పునాదులు లేనివే' అని ఆ రోజు ఆయన చెప్పిన మాట నాకు చాలా నచ్చింది. అదే శీర్షికగా ఇచ్చాము. అనంతపురం, కర్నూలు హైదరాబాద్, ఖమ్మం, విజజవాడ, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, బెంగళూరు, న్యూఢిల్లీ... ఒకటేమిటి? చాలా చోట్ల ప్రసంగాలు, సాహిత్య శాలలు, జనకవనాలు సంతృప్తిగా నిర్వహించడంలో తోడు నిలిచారు. విశాలాంధ్ర, ప్రజాశక్తి ప్రచురణ సంస్థలు రెండింటిలో సంపాదక వర్గాల్లో కీలకపాత్ర నిర్వహించిన గౌరవం ఆయనకే దక్కిందేమో. అరసం అధ్యక్షుడిగా వున్నా, సాహితీ స్రవంతి సన్నిహితుల్లో ప్రథములుగా వుంటారు. ఇదంతా తన విశాల ప్రజాతంత్ర స్ఫూర్తి ఫలితమే. రాచపాళెం సతీమణి శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారి ఆదరణ, ఆతిథ్యం ఆయన మిత్రులందరికీ పరిచయం. ఆయన కుటుంబ సభ్యులు కూడా తన కృషికి సదా తోడు నిలవడం ఆనందదాయకం. మా విస్తృత కుటుంబానికి ఆయన సుపరిచితులు. మా సుదీర్ఘ స్నేహంలో చాలా విషయాలు గుర్తుకు వస్తుంటాయి.

కాలక్రమంలో ఎవరిలో ఏ మార్పులు వచ్చినా, ప్రతీఘాత శక్తులు ప్రత్యక్ష దాడి చేసినా, రాచపాళెం మాత్రం నమ్మిన విలువలకూ విశ్వాసాలకే నిబద్ధులై అచంచలంగా నిలబడ్డారు. ఆరోగ్యపరమైన సమస్యలున్నా వాటిపై పోరాడుతూనే ఆయన అభ్యుదయ శక్తులకు కొండంత అండగా నిలిచారు. ఈ యాభై ఏళ్లలో రాచపాళెం చేసిన అత్యధిక రచనలు తులనాత్మకం, మార్గనిర్దేశకం, విషయ సంపన్నం. మరిన్ని దశాబ్దాలు ఆయన ఆరోగ్యం కాపాడుకుంటూ విలక్షణ కృషి సాగాలని, తన కలంతో, గళంతో ప్రగతి ప్రస్థానం సాగించాలని కోరుకుంటున్నాను.

(ఈనెల 14న అనంతపురం ప్రభుత్వ కళాశాలలో రాచపాళెం అభినందన సంచిక 'విమర్శా పునర్నవం' ఆవిష్కరణ, రోజంతా సాహిత్య కార్యక్రమాలు జరుగుతాయి.)

– తెలకపల్లి రవి

మూలభాషపై పట్టుంటే అనువాదంలోనూ అది కొనసాగుతుంది

తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులోని విజయ్ రీడర్స్ సర్కిల్ ఏటా ఇచ్చే అనువాద పురస్కారాన్ని, రూ.50 వేల నగదు బహుమతిని, 2023 సంవత్సరానికి గానూ– తెలుగు కథా రచయిత, కవి, అనువాదకుడు జిల్లేళ్ళ బాలాజీ ఆదివారం నాడు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో సంభాషణ.. టూకీగా ...

'కె.ఎస్.విరుదు' అనువాద పురస్కారం పొందినందుకు మీ అనుభూతి?

అస్సలు ఊహించలేదు. జయకాంతన్‌కు అత్యంత సన్నిహితులైన కీ.శే. కె.ఎస్.సుబ్రమణియన్ అనువాద రంగంలో చేసిన కృషి అపారం. జయకాంతన్ రచనలే కాదు, ఆయనపై 'రీడర్'నూ, తమిళ ఆధునిక కవితా సంకలనం, ఓ ప్రముఖ తమిళ కవి మొత్తం సాహిత్యంపై విమర్శనాత్మక గ్రంథం, భారతరత్న సి.ఎస్.పై వ్యాసాలు... ఇలా ఎన్నింటినో ఆయన ఆంగ్లంలోకి తీసుకెళ్లి తమిళనాట కీర్తి గడించారు. ఆయన మరణానంతరం ఆయన పేరు మీద ఇచ్చే పురస్కారానికి నన్ను ఎంపిక చేసినందుకు చాలా సంతోషంగా ఉంది.

మీరు అనువాద రచనలు చేయడానికి స్ఫూర్తి?

ఎవరూ లేరు. నిజానికి నాకు అనువాదంపై అస్సలు ఆసక్తి లేదు. కానీ నేను అనువదించిన మొదటి అనువాద నవలకే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావటంతో అనువాదాలపై మక్కువ పెంచుకుని 130కి పైగా కథలు, 12 నవలలు, 2 నవలికలు, ఒక కవితా సంపుటి, ఒక వ్యాస సంపుటి, ఒక వచన రామాయణం తమిళం నుంచి తెలుగులోకి అనువదించాను.

తెలుగు నుంచి తమిళంలోకి ఏమైనా అనువదించారా?

లేదు. ఎందుకంటే నా మాతృభాష తెలుగు. తమిళం నాకు అదనంగా ఒంటబట్టిన భాష. ఆ భాషను నేను గురు ముఖతా నేర్చుకోలేదు. మా బంధువులందరూ తిరుత్తణిలో ఉండటంతో చిన్నప్పటి నుంచి అక్కడికి వెళ్తూ, అక్కడి వాళ్లతో వచ్చీరానీ తమిళంలో మాట్లాడుతూ, తమిళ సినిమాలు చూస్తూ, తమిళ పత్రికలు చదువుతూ ఆ భాష నాకు బాగా తెలిసొచ్చింది. తమిళం నుంచి ఏ రచననైనా అనువదిస్తున్నప్పుడు తమిళ పదాలకు తెలుగులో ఎన్నో పర్యాయ పదాలు వేగంగా మతికొస్తాయి. కానీ, తెలుగు నుంచి అనువాదం చెయ్యాలని ప్రయత్నించినపుడు అలా ఏమీ గుర్తుకు రావు. కనుకనే నేను తమిళంలోకి అనువాదం చేసేందుకు ప్రయత్నించలేదు.

స్వీయ రచనకు, అనువాద రచనకు స్పష్టమైన తేడా చెప్పండి?

స్వీయ రచన మన సొంతం. అది మన మదిలో రూపుదిద్దుకున్న రచన. ఆ రచనకు మనమే కర్తా కర్మా క్రియా అన్నీనూ. అందుకే మన అభీష్టానుసారం దానికి రూపురేఖలు దిద్దుతాం. దానికి సరిపడా సొగసులు అద్దుతాం. దానిపై మనకున్న సాధికారతతో దాని నడకను కొనసాగిస్తాం. కానీ అనువాదానికి ఆ వెసులుబాటు ఉండదు. అది మరొకరి సొంతం. స్వేచ్ఛ వాంఛనీయం కాదు. మూల రచయిత ఛాయలోనే మన నడక కొనసాగాల్సి ఉంటుంది.

తమిళ నవలలు అనేకం అనువదించాక, తెలుగు నవలలతో తులనాత్మక అధ్యయనం ఏమైనా చేశారా?

రెండింటినీ తులనాత్మక అధ్యయనం చెయ్యలేదు. కానీ రెండూ చదివి నాకు నేను బేరీజు వేసుకుంటున్నాను. తేడాలు గ్రహిస్తున్నాను. విలక్షణమైనవేవో గుర్తించగలుగుతున్నాను.

మీరు అనువాద రచనలు చేస్తున్నప్పుడు మీ స్వీయ రచనల ప్రభావముంటుందా?

ఏమాత్రం ఉండదు. ఏ ప్రభావమూ పడకుండా నా మనసును ప్రశాంతంగా ఉంచుకుంటాను. అది మరెవరి రచనో అనీ, దాన్ని నేను అనువదిస్తున్నానన్న స్పృహ మాత్రమే ఉండేలా చూసుకుంటాను. అయితే ఆ రచనను ఎంత వీలైతే అంత మెరుగ్గా తీసుకురావటానికి ప్రయత్నిస్తాను. ఉత్తమ ప్రమాణాలను పాటిస్తాను. మన పాఠకులకు బాగా అర్థమయ్యేలా అనువాదాన్ని కొనసాగిస్తాను.

తమిళ నవలాకారుడు జయకాంతన్ రచనలతో ప్రయాణించినపుడు మీరు ప్రధానంగా గమనించిన విషయాలు?

ఆయన పెద్దగా చదువుకోలేదన్న విషయం ఏ రచనలోనూ మనకు కనిపించదు. పైపెచ్చు కొన్ని నవలల్లో ఇంగ్లీషు వాడిన తీరు అద్భుతమనిపిస్తుంది. ఆయన రచన చదువుతున్నప్పుడు నెక్స్ట్ డైలాగ్ 'అతని' నుండే వస్తుంది అని ఊహిస్తాం. కానీ ఆ డైలాగ్ 'ఆమె' నుండి వస్తుంది. ఇది ఎప్పటికప్పుడు నన్ను ఆశ్యర్యంలో ముంచే వ్యవహారం. ఆయన ఏ కథా పేలవంగా ఉండదు. సాఫీగా సాగుతాయి. ఆయన నుండి ఇంకా రచనలు వచ్చి ఉండాలి అని ఇంటర్వ్యూలో నేనడిగిన ప్రశ్నకు ఆయనిచ్చిన జవాబు ఏమిటంటే "రాయాలి అనుకున్నప్పుడు ఎంతో రాశాను. ఇక చాలు అనుకున్నా, మానేశాను." ఇంతకన్నా నిబద్ధత కలిగిన రచయిత ఎవరుంటారు? దటీజ్ జయకాంతన్!

అనువాదంలో మూల రచన సగం కోల్పోతుందనడం నిజమేనా?

కాదు, ఇదొక అపవాదు మాత్రమే. మూల భాష తెలిసినప్పుడు, దానిపై పట్టున్నప్పుడు యథావిధిగా అనువాదంలోనూ అది కొనసాగుతుంది. అంతేకానీ, ఏదీ కోల్పోవటమంటూ జరగదు. కానీ, మీకో విషయం చెప్పాలి. చాలామంది అనువాదకులు ఆంగ్లం నుండి అనువదిస్తూ ఉంటారు. అయితే వచ్చిన చిక్కల్లా వాళ్లకు ఆ మూల భాష తెలిసి ఉండదు. అప్పుడు మూల భాష నుండి ఆంగ్లంలోకి అనువదితమైనప్పుడు కొంతా, ఆంగ్లం నుండి అనువాద భాషలోకి వచ్చినప్పుడు మరికొంతా కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. కానీ నేను మూల భాష నుండే తర్జుమా చెయ్యటం వల్ల పోగొట్టేదంటూ ఏమీ ఉండదు. వంద శాతం న్యాయం చెయ్యటానికే ప్రయత్నిస్తాను.

సంభాషణ : డా.పెరుగు రామకృష్ణ
98492 30443

విపణి వీధిలో ...

సర్వాధికారై
సర్వమానవ కళ్యాణమై
సర్వాస్త్ర భూషితై
సత్యమేవ జయతే అంటూ ధర్మశాస్త్రంలో
న్యాయం లిఖితమైంది!
శాస్త్రకోవిదుడు చదువుతాడు
చిగురించిన మెదడు
రెమ్మ కొమ్మలై విస్తరిస్తుంది
ధర్మక్షేత్రంలో ఒక విశ్లేషణ
చట్టసభల్లో ఒక సమర్పణ
సభాస్థలిలో ఒక సారాంశం
న్యాయం వివిధాలై
సవ్య అపసవ్య భ్రమణం!
న్యాయం తర్ఫీదైన మర్కటం
తీగపై నడుస్తుంది
గెంతుతుంది దూకుతుంది
భువిలో సర్కస్ చేస్తుంది
కళను ఆస్వాదించిన చేతులు
బహుమతిగా డబ్బు విసిరిన చోట
రెండు కాళ్ళపై నిలబడి
వినయంగా నమస్కరిస్తుంది!
న్యాయం శిక్షణైన గంగిరెద్దు
అందంగా అలంకరణై
కలవారింట కోసేపు చిందులేసి
అయ్యగారికి దండమై
మోకాళ్ళపై నమస్కరించి
పారితోషికం అందాక
దీవెనై తలూపుతుంది!
న్యాయం ధనాఢ్యుడి పాదాల చెంత
పెంపుడు శునకమై పొదుగుతుంది!
ధనహీనుడిపై బడి
జాతి జాగిలమే
కండను పెకలిస్తుంది!
న్యాయం ఒకచోట దృశ్యం
ఒక చోట అదృశ్యం
ఒకచోట కొనుగోలు
ఒక చోట అమ్మకం !

– అడిగోపుల వెంకటరత్నమ్
98482 52946

మాండలికంలో మధుర కథలు



భావ ప్రసారానికి భాష మూలం. మాటలు నేర్చే ప్రతి శిశువూ స్థానిక భాషలోనే మాట్లాడతాడు. మిగిలిన భాషలు ఎంత అందమైనవైనా, ఉన్నతమైనవైనా పరాయి భాష కిందనే లెక్క. మాతృభాషలోనే నేర్చుకోవడం, ఆలోచించడం చేస్తారు పిల్లలు. అందుకే తెలంగాణా ప్రభుత్వం గొండీ, కొలామి, లంబాడీ తదితర భాషలు కలిగిన పిల్లల కోసం ప్రత్యేక పాఠ్య పుస్తకాలు రూపకల్పన చేస్తోంది. పైడిమర్రి రామకృష్ణ తన తెలంగాణ యాసలో 'జోర్దార్ కతలు' బాలల కథల పుస్తకం తెచ్చారు. ఇవిగతంలో వ్యవహారికంలో రాసినవే. అయినా, మాండలిక యాసను పిల్లలకు పరిచయం చేయడం కోసమే ప్రత్యేకంగా తిరిగి రాసి చక్కగా 12 కథలతో అచ్చు వేయించారు. కథల్లో అన్నీ పక్షులు, జంతువులే. అయినా మనుషులకు, వారి ప్రవర్తనకు ఇవి దర్పణం. సరళ మాండలికంలో రాయడం చేత చదవడం చాలా తేలిక. ఈ కథల వల్ల ఐకమత్యం, పరోపకారం, సహనశీలత, సాటి వారి పట్ల కరుణ కలిగి ఉండడం, తార్కిక జ్ఞానం తదితర లక్షణాలను చిన్ననాడే పిల్లలకు అలవాడతాయి. పిల్లలకు మాండలిక కథలు కొరుకుడు పడతాయా? అని ఎవరికైనా సందేహం రావచ్చు. పాలపిట్టని, బోడి గుట్టని కంప్యూటర్‌లో తప్ప కళ్లెదురుగా చూడలేని నగర పరివారపు పిల్లలకు చదవడం బహుశా ఇబ్బందేమో! కానీ, నిత్యం ఆకుపచ్చ పొలాల్లో తిరుగాడే బాల బాలికలకు ఈ భాష కరతలామలకం. కథ చదువుతుంటే తమ భాషలో తమను చూసుకున్నట్లవుతుందే కానీ, కష్టం కాబోదు. మొదటి కథ 'ఉల్టా–పల్టా' మొదలు పెడితే చివరి కథ 'మారిన కోతి' వరకు ఏకబిగిన చదివిస్తాయి. మా బడిలో పిల్లల చేత చదివించినప్పుడు, ఒక దాని వెంట ఒకటి వదలకుండా చదివేశారు. ఈ కథలు చదివితే పిల్లల్లో తమ భాష పట్ల, తమ ప్రాంతం పట్ల ప్రేమ పెరుగుతుంది. పక్షులతో, జంతువులతో మానసిక అనుబంధం ఏర్పడుతుంది. పిల్లలని ప్రేమించే పెద్దలు కొని చదివి, తమ పిల్లల చేత చదివించ వలసిన మంచి పుస్తకం 'జోర్దార్' కథలు. పుస్తకం కోసం 92475 64699లో సంప్రదించవచ్చు.

– రావూరి రమాదేవి, 99123 5934

రైతు ఉద్యమంపై మోడీ సర్కార్ అక్కసు

- న్యూస్‌క్లిక్ జర్నలిస్టులపై ఎఫ్ఐఆర్ అందులో భాగమే
- దేశవ్యాప్త ఆందోళనలకు ఎస్‌కెఎం పిలుపు

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా న్యూఢిల్లీలో ఎస్‌కెఎం ఆందోళనల దృశ్యం (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

న్యూస్‌క్లిక్ జర్నలిస్టులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా రైతుల ఉద్యమంపై బిజెపి, ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీలో చారిత్రాత్మక రైతు ఉద్యమంపై ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దుర్మార్గపు ఆరోపణల గురించి తెలుసుకుని దిగ్భ్రాంతికి గురైనట్లు ఎస్‌కెఎం పేర్కొంది. న్యూస్‌క్లిక్, జర్నలిస్టులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో రైతుల ఉద్యమంపై చేసిన ఆరోపణలన్నింటినీ ఖండిస్తున్నట్లు తెలిపింది. 'దేశ ప్రజలకు అవసరమైన సరఫరాలకు అంతరాయం కలిగించడం, అత్యవసర సేవలకు అంతరాయం కలిగించడం, ఆస్తులకు నష్టం కలిగించడం, విధ్వంసం సృష్టించడం, భారత ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం కలిగించడం, అక్రమంగా విదేశీ నిధులను స్వీకరించడం ద్వారా అంతర్గత శాంతిభద్రతల సమస్యలను సృష్టించడం' రైతుల ఉద్యమం చేసిందంటూ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలన్నీ అబద్ధాలనీ, ప్రేరేపితమైనవని పేర్కొంది.

"బిజెపి ప్రభుత్వ రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల చట్టాలు, విధానాలకు వ్యతిరేకంగా ఎస్‌కెఎం నేతృత్వంలోని రైతులు, దేశంలోని అన్నదాతలు శాంతియుత నిరసనలో పాల్గొన్నారు. రైతులకు సరఫరాకు అంతరాయం కలగలేదు. రైతుల వల్ల ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదు. ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. శాంతిభద్రతల సమస్య తలెత్తలేదు. ముండ్ల కంచెలు, నీటి ఫిరంగులు, లాఠీ చార్జీలు, రోడ్లపై కందకాలు తవ్వడం వంటివాటితో దేశ రాజధానికి చేరుకునే వారు ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోకుండా కేంద్ర ప్రభుత్వం రైతులను హింసాత్మకంగా ఆపింది. అది దేశ ప్రజలకు, రైతులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది.

మండుతున్న వేసవి ఎండలు, కుండపోత వర్షాలు, గడ్డకట్టే చలితో రైతులు 13 నెలల పాటు నిరసనలో కూర్చోవలసి వచ్చింది. బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం శాంతి భద్రతల సమస్యలను సృష్టించింది. లఖింపూర్ ఖేరీ వద్ద ర్యాలీ చేస్తున్న రైతులను వాహనాలతో తొక్కించి, నలుగురు రైతులు, ఒక జర్నలిస్టును చంపారు. ఈ దాడి వెనుక కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఆయన కుమారుడి హస్తం ఉంది. ఇప్పటి వరకు ఆ మంత్రిని ప్రధానమంత్రి తొలగించలేదు. మోడీ ప్రభుత్వ అణచివేతను ఎదుర్కోవడానికి లఖింపూర్ ఖేరీ రైతులతో సహ 735 మంది రైతులు తమ ప్రాణాలను త్యాగం చేయాల్సి వచ్చింది" అని పేర్కొంది.

న్యూస్‌క్లిక్ ఎఫ్ఐఆర్‌లో రైతుల ఉద్యమంపై చేసిన తప్పుడు, దుర్మార్గపు ఆరోపణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రతి రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రం, మండల కేంద్రంలో పెద్దఎత్తున నిరసనలు చేపట్టాలని ఎస్‌కెఎం పిలుపునిచ్చింది. రైతుల ఉద్యమంపై చేసిన అన్ని ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్‌కెఎం నాయకుల ప్రతినిధి బృందాలు రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఢిల్లీ పోలీసు కమిషనర్‌కి వినతులు సమర్పిస్తాయని పేర్కొంది.

లడఖ్ కౌన్సిల్ ఎన్నికల్లో.. కాంగ్రెస్-ఎన్‌సి కూటమి విజయం

- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలి ఎన్నికలు

కాంగ్రెస్-ఎన్‌సి మద్దతుదారుల విజయోత్సవ వేడుకలు

లేహ్ : కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్‌లోని కార్గిల్‌లో లడఖ్ అటానమస్ హిల్ కౌన్సిల్‌కు నిర్వహించిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 26 స్థానాలకు ఎన్నికలు జరగ్గా, నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి 19 స్థానాల్లో గెలుపొందాయి. ఎన్‌సి 11, కాంగ్రెస్ 8 సీట్లలో విజయం సాధించాయి. బిజెపి 2 సీట్లు, ఐఎన్‌డిపి ఒక సీటు గెలుచుకున్నాయి. 4 సీట్ల ఫలితాలు రావాల్సి ఉంది. 26 స్థానాల్లో 85 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 2019 ఆగస్ట్ 5న జమ్ముకాశ్మీర్ స్వయం ప్రతిపత్తికి సంబంధించిన ఆర్టికల్ 370ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని జమ్ముకాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ సందర్భంగా జమ్ముకాశ్మీర్‌లోని రాజకీయ పార్టీల నేతలను గృహ నిర్బంధం చేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఈ తీర్పు ఇచ్చినట్లుగా జమ్ముకాశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు పేర్కొన్నాయి. రాష్ట్ర విభజన వల్ల తాము చాలా నష్టపోయినట్టు పోలింగ్ సందర్భంగా కార్గిల్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. జమ్ముకాశ్మీర్‌ను తిరిగి విలీనం చేయడంతోపాటు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఆదిత్య ఎల్ 1 కోసం కీలక ఆపరేషన్ : ఇస్రో

బెంగళూరు : ఆదిత్య ఎల్1ను సరైన మార్గంలో ఉంచేందుకు కీలక ఆపరేషన్ నిర్వహించినట్లు ఇస్రో ఆదివారం ప్రకటించింది. స్పేస్ క్రాఫ్ట్ లోని ఇంజన్లను 16 సెకన్ల పాటు మండించి ట్రాజెక్టరీ కరెక్షన్ మ్యాన్యూవర్ (టిసిఎం) ని నిర్వహించినటు ఇస్రో తెలిపింది. సెప్టెంబర్ 19న ప్రదర్శించిన ట్రాన్-లాగ్రాంజియన్ పాయింట్ 1 ఇన్సర్షన్ (టిఎల్ 1) ట్రాక్ చేసిన తర్వాత దాని మార్గాన్ని సరిచేసేందుకు మాన్యువర్ అవసరమని భావించినట్లు ఇస్రో ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొంది. ఎల్ 1 చుట్టూ ఉన్న హాలో కక్ష్యలో నౌకను ప్రవేశపెట్టేందుకు ఉద్దేశించిన మార్గంలో నౌకను ఉంచేందుకు టిసిఎం చేపట్టినట్లు, ఆదిత్య ఎల్ 1 ముందుకు సాగుతోందని, మరికొన్ని రోజుల్లో మాగ్నెటోమీటర్ మళ్లీ ఆన్ చేయబడుతుందని ఇస్రో పోస్ట్ చేసింది.

అంతరిక్ష నౌక బాగానే ఉందని, కీలక గమ్యస్థానానికి చేరుకుంటోందని పేర్కొంది. సెప్టెంబర్ 2న ప్రయోగించిన ఆదిత్య ఎల్1 సూర్యుడికి, భూమికి మధ్య 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉండే ఎల్ 1 పాయింట్ వద్దకు వెళ్తోంది. ఇప్పటికే 9 లక్షల కిలోమీటర్ల వరకు ఉండే భూమి గురుత్వాకర్షణ శక్తిని నౌక తప్పించుకుని ముందుకెళ్లింది. ఆదిత్య ఎల్ 1 సైంటిఫిక్ డేటాను సేకరించడం కూడా ప్రారంభించింది. ఎస్‌టిఇపిఎస్ (సుప్రా థర్మల్, ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్) పరికరం యొక్క సెన్సార్లు భూమి నుండి 50,000 కి.మీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న సుప్రా-థర్మల్ మరియు ఎనర్జిటిక్ అయాన్‌లు, ఎలక్ట్రాన్‌లను కొలవడం ప్రారంభించాయి. ఈ డేటా భూమిచుట్టూ ఉన్న కణాల ప్రవర్తనను విశ్లేషించడంలో సహాయపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

అంగ్‌సాన్ సూకీ పిటిషన్‌లను తోసిపుచ్చిన మయన్మార్ సుప్రీంకోర్టు

నైఫిడా : మయన్మార్ మాజీ అధ్యక్షురాలు అంగ్‌సాన్ సూకీ తనపై నమోదైన ఆరు అవినీతి నేరారోపణలకు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌లను సుప్రీంకోర్టు నిరాకరించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ పిటిషన్‌లపై స్పందించేందుకు జుంటా సైన్యం నిరాకరించింది. అక్రమంగా వాకీటాకీలను దిగుమతి చేసుకోవడం, కలిగి ఉండటం, దేశద్రోహం, కొవిడ్ ఆంక్షలను ఉల్లంఘించడంపై అంగ్‌సాన్ సూకీ చేసిన ఐదు అప్పీళ్లను ఆగస్టులో కోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని 2021లో జుంటా సైన్యం పడగొట్టి మయన్మార్‌ను తమ చేతుల్లోకి తీసుకుంది. అప్పటి నుండి సూకీ నిర్బంధంలోనే ఉన్నారు. ఆమెపై దేశద్రోహం, లంచం కేసులతో పాటు టెలికమ్యూనికేషన్ చట్టాన్ని ఉల్లంఘించడం వంటి సుమారు 12కు పైగా నేరారోపణలు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి 27 ఏళ్ల జైలుశిక్షను ఎదుర్కొంటున్నారు. ఈ ఆరోపణలను అంగ్‌సాన్ సూకీ ఖండించారు. తిరుగుబాటు, ప్రత్యర్థులపై జుంటా సైన్యం అణచివేతలతో మయన్మార్ అల్లకల్లోలంగా మారింది. వేలాది మంది జైలు పాలయ్యారు. హత్య చేయబడ్డారు. అంగ్‌సాన్ సూకీతో పాటు ఖైదు చేయబడిన ఇతర రాజకీయ నేతలను షరతులు లేకుండా విడుదల చేయాలని అనేక ప్రభుత్వాలు పిలుపునిచ్చాయి. జుంటా సైన్యం పాక్షిక క్షమాపణ కింద ఆమెకు ఆరేళ్ల జైలు శిక్షను తగ్గించినట్లు గతంలో మీడియా వెల్లడించింది.

ఓటమి భయంతోనే ఇడి దాడులు

- బిజెపిపై కేరళ సిఎం విజయన్ విమర్శ

కన్నూర్ : మూడోసారి అధికారంలోకి రావడం సాధ్యం కాదనే భయంతోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దాడులు చేయిస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో ఏకకాలంలో శనివారం ఇడి దాడులు నిర్వహించింది. ధర్మాడం నియోజకవర్గంలో ఎల్‌డిఎఫ్ కుటుంబాలతో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బిజెపి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం కోలుకోలేని ప్రమాదమనే వాస్తవాన్ని దేశ ప్రజలు గుర్తించారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇతర రాష్ట్రాలతోపాటు కాకరూరిలో ఇడితో దాడులు చేయించిందని విమర్శించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో మరిన్ని దాడులు జరిగే అవకాశముందని తెలిపారు. బిజెపియేతర అభ్యర్థి ఎవరు గెలిచినా ఫర్వాలేదని అనుకోకుండా లౌకికవాదానికి గట్టిగా కట్టుబడే వారిని, మతతత్వాన్ని ప్రతిఘటించే వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ కచ్చితమైన వైఖరిని తీసుకోలేకపోయిందని ముఖ్యమంత్రి అన్నారు.

రెండు వేలు దాటిన ఆఫ్ఘన్ భూకంప మృతులు

ఇస్లామాబాద్ : పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌లో శనివారం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య రెండు వేలకు పెరిగింది. ఈ విషయాన్ని తాలిబన్ ప్రతినిధి ఆదివారం ప్రకటించారు. పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌లో శనివారం 6.3 తీవ్రతతో భూకంపం, అనంతరం బలమైన ప్రకంపనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే సంస్థ వివరాల ప్రకారం హెరత్ నగరానికి వాయువ్యంగా 40 కిలోమీటర్ల దూరంలో భూకంపం కేంద్రం ఉంది. హెరత్ ప్రావిన్స్‌లో జెండా జాన్ జిల్లాలోని నాలుగు గ్రామాలు భూంకంపం దాటికి తీవ్రంగా ప్రభావితమయ్యాయని విపత్తు అధికార ప్రతినిధి మహ్మద్ అబ్దుల్లా జాన్ తెలిపారు. ఈ నాలుగు గ్రామాల్లో కమ్యూనికేషన్ పూర్తిగా నాశనమవడంతో, పూర్తి వివరాలు వెల్లడికాలేదని చెప్పారు.

ఐక్యరాజ్యసమితి అందించిన ప్రాథమిక గణాంకాల ప్రకారం భూకంపంతో 465 ఇళ్లు ధ్వంసం కాగా, మరో 135 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. భవనాల శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయారు. సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని ఐక్యరాజ్య సమితి, స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, గతేడాది జూన్‌లో ఆఫ్ఘనిస్తాన్‌లో సంభవించిన భయంకరమైన భూకంపంలో దాదాపు వెయ్యి మంది మరణించారు. దాదాపు 10,000 మంది నిరాశ్రయులయ్యారు. ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదైంది. ఈ ఏడాది మార్చిలో ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దుల్లో 6.5 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల 13 మంది చనిపోయారు.

భారత్ బోణీ

(మొదటి పేజీ తరువాయి)

బుమ్రా (2/35) రాణించటంతో ఆస్ట్రేలియా 199 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో డెవిడ్ వార్నర్ (41, 52 బంతుల్లో 6 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (46, 71 బంతుల్లో 5 ఫోర్లు) రాణించారు. ఛేదనలో చెలరేగిన కెఎల్ రాహుల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

భయపడినా..అదరగొట్టారు : ఛేదనలో టీమ్ ఇండియాకు ఆసీస్ పేసర్లు గట్టి షాక్ ఇచ్చారు. లక్ష్యం చిన్నదే అయినా.. 2 పరుగులకే మూడు వికెట్లు చేజార్చుకోవటంతో ఆతిథ్య జట్టు విజయావకాశాలు అమాంతం పడిపోయాయి. జోశ్ హాజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్ నిప్పులు చెరగటంతో రోహిత్ శర్మ (0), ఇషాన్ కిషన్ (0), శ్రేయస్ అయ్యర్ (0) ఇన్నింగ్స్ తొలి 12 బంతులకే పెవిలియన్ బాట పట్టారు. ఈ సమయంలో విరాట్ కోహ్లి (85), కెఎల్ రాహుల్ (97 నాటౌట్) అద్భుత ఆటతీరు చూపించారు. ఛేదనలో మొనగాడు కోహ్లికి రాహుల్ చక్కటి సహకారం అందించాడు. కోహ్లి 12 పరుగుల వద్ద ఓ జీవన దానం పొందాడు. అవకాశం చక్కగా సద్వినియోగం చేసుకున్న కోహ్లి.. మూడో వికెట్‌కు రాహుల్‌తో కలిసి గెలుపు భాగస్వామ్యం నిర్మించాడు. కోహ్లి మూడు ఫోర్లతో 75 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించగా.. రాహుల్ ఐదు ఫోర్లతో 72 బంతుల్లో అర్ధ శతకం కొట్టాడు. అర్ధ సెంచరీల అనంతరం ఇద్దరూ గేర్ మార్చారు. చివర్లో కోహ్లి అవుటైనా.. హార్దిక్ పాండ్య (11 నాటౌట్) తోడుగా రాహుల్ లాంఛనం ముగించాడు. 41.2 ఓవర్లలోనే భారత్ 201 పరుగులు చేసి ప్రపంచకప్‌లో తొలి విజయం సాధించింది. ఆసీస్ బౌలర్లలో హాజిల్‌వుడ్ (3/38) మూడు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు.

మనోళ్ల మాయ : టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా తొలుత ఎంచుకుంది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (0)ను బుమ్రా పవర్‌ప్లేలోనే సాగనంపి బ్రేక్ ఇచ్చాడు. కానీ డెవిడ్ వార్నర్ (41), స్టీవ్ స్మిత్ (46) జోడీ ఆసీస్‌ను నిలబెట్టారు. రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. బంతి స్పిన్నర్ల చేతికి అందటంతో కథ మారింది. వార్నర్‌ను కుల్దీప్.. స్మిత్‌ను జడేజా సాగనంపగా.. ఆ తర్వాత మరో బ్యాటర్ క్రీజులో కుదురుకోలేదు.

మార్నస్ లబుషేన్ (27), గ్లెన్ మాక్స్‌వెల్ (15)లను సైతం జడేజా, కుల్దీప్ జోడీ వెనక్కి పంపించింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (0) డకౌట్‌గా నిష్క్రమించాడు. కామెరూన్ గ్రీన్ (8), ఆడం జంపా (6)లు సైతం ఎంతోసేపు క్రీజులో నిలువలేదు. చివర్లో కెప్టెన్ పాట్ కమిన్స్ (15), మిచెల్ స్టార్క్ (28) కాసిన్ని పరుగులు జోడించారు. 49.3 ఓవర్లలో కుప్పకూలిన ఆస్ట్రేలియా 199 పరుగులు చేసింది. భారత బౌలర్లలో జడేజా మూడు వికెట్లు పడగొట్టగా.. కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా రెండేసి వికెట్లు కూల్చారు.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (ఎల్బీ) హాజిల్‌వుడ్ 0, ఇషాన్ కిషన్ (సి) కామెరూన్ గ్రీన్ (బి) మిచెల్ స్టార్క్ 0, విరాట్ కోహ్లి (సి) లబుషేన్ (బి) హాజిల్‌వుడ్ 85, శ్రేయస్ అయ్యర్ (సి) వార్నర్ (బి) హాజిల్‌వుడ్ 0, కెఎల్ రాహుల్ 97 నాటౌట్, హార్దిక్ పాండ్య 11 నాటౌట్, ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (41.2 ఓవర్లలో 4 వికెట్లకు) 201.

వికెట్ల పతనం : 1-2, 2-2, 3-2, 4-167.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 8-0-31-1, జోశ్ హాజిల్‌వుడ్ 9-1-38-3, పాట్ కమిన్స్ 6.2-0-33-0, గ్లెన్ మాక్స్‌వెల్ 8-0-33-0 , కామెరూన్ గ్రీన్ 2-0-11-0, ఆడం జంపా 8-0-53-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : వార్నర్ (సి,బి) కుల్దీప్ యాదవ్ 41, మిచెల్ స్టార్క్ (సి) కోహ్లి (బి) బుమ్రా 0, స్టీవ్ స్మిత్ (బి) రవీంద్ర జడేజా 46, లబుషేన్ (సి) రాహుల్ (బి) రవీంద్ర జడేజా 27, మాక్స్‌వెల్ (బి) కుల్దీప్ యాదవ్ 15, అలెక్స్ కేరీ (ఎల్బీ) రవీంద్ర జడేజా 0, కామెరూన్ గ్రీన్ (సి) హార్దిక్ పాండ్య (బి) అశ్విన్ 8, పాట్ కమిన్స్ (సి) శ్రేయస్ అయ్యర్ (బి) బుమ్రా 15, మిచెల్ స్టార్క్ (సి) శ్రేయస్ అయ్యర్ (బి) సిరాజ్ 28, ఆడం జంపా (సి) కోహ్లి (బి) హార్దిక్ పాండ్య 6, హాజిల్‌వుడ్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 12, మొత్తం : (49.3 ఓవర్లలో ఆలౌట్) 199.

వికెట్ల పతనం : 1-5, 2-74, 3-110, 4-119, 5-119, 6-140, 7-140, 8-165, 9-189, 10-199.

బౌలింగ్ : బుమ్రా 10-0-35-2, మహ్మద్ సిరాజ్ 6.3-1-26-1, హార్దిక్ పాండ్య 3-0-28-1, అశ్విన్ 10-1-34-1, కుల్దీప్ యాదవ్ 10-0-42-2, రవీంద్ర జడేజా 10-2-28-3.

రాజస్థాన్‌లో నీట్ విద్యార్థి ఆత్మహత్య

మూడు రోజుల్లో రెండో ఘటన

జైపూర్ : రాజస్థాన్‌లోని సికార్ పట్టణంలో నీట్‌కు శిక్షణ పొందుతున్న 18 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భరత్‌పూర్ జిల్లా నాద్‌బై పట్టణానికి చెందిన నితిన్ ఫౌజ్దార్ నీట్ శిక్షణ కోసం జూన్‌లో సికార్ పట్టణానికి వచ్చాడు. ఒక కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. శనివారం తరగతులకు వెళ్లకుండా ప్రైవేట్ హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సికార్ పట్టణంలో మూడు రోజుల వ్యవధిలో ఇది రెండో ఆత్మహత్య. ఈ నెల 3న నీట్‌కు శిక్షణ పొందుతున్న 16 ఏళ్ల కౌషల్ మీనా కూడా ఆత్మహత్యకు పాల్పడ్డారు.

పశ్చిమబెంగాల్ మంత్రి హకీమ్ నివాసంలో సిబిఐ సోదాలు

కోల్‌కతా : పశ్చిమబెంగాల్ సీనియర్ మంత్రి ఫిర్హాద్ హకీమ్ నివాసంలో సిబిఐ దాడులు నిర్వహించింది. దక్షిణ కోల్‌కతాలోని చెట్లా ప్రాంతంలో హకీమ్ నివాసానికి కేంద్ర బలగాలతో పాటు పెద్ద సంఖ్యలో సిబిఐ అధికారులు ఆదివారం ఉదయం చేరుకుని, సోదాలు నిర్వహించినట్లు సీనియర్ అధికారులు తెలిపారు. ఇద్దరు సిబిఐ అధికారులు హకీమ్‌ను విచారిస్తున్నట్లు చెప్పారు. పురపాలక సంస్థ నియామకాల్లో అక్రమాలకు పాల్పడినట్లు సిబిఐ ఆరోపించింది.

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టిఎంసి)లో సీనియర్ నేత, పార్టీలో పట్టున్న హకీమ్ ప్రస్తుతం పట్టణాభివృద్ధి, మునిసిపల్ వ్యవహారాల మంత్రిగా, కోల్‌కతా మేయర్‌గా కొనసాగుతున్నారు. సోదాలను వ్యతిరేకిస్తూ.. హకీమ్ మద్దతుదారులు ఆయన నివాసం ఎదుట నిరసన చేపట్టారు.

ఇదే కేసుకు సంబంధించి గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆహార శాఖ మంత్రి రథిన్ ఘోస్ నివాసంతోపాటు పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టాయి. 2014, 2018 మధ్య కాలంలో రాష్ట్రంలోని వివిధ మునిసిపాలిటీల్లో సుమారు 1500 మందిని అక్రమంగా నియమించారని కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి.

మణిపూర్‌లో గ్రెనేడ్‌తో దాడి

- సిఆర్‌పిఎఫ్ జవాన్, మహిళకు గాయాలు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. రాజధాని ఇంఫాల్‌లో శనివారం రాత్రి మోటార్ సైకిల్‌పై వచ్చిన గుర్తు తెలియని దుండగులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ నివాసం గేటు వద్ద గ్రెనేడ్‌ను విసిరినట్లు పోలీసులు తెలిపారు. ఈ పేలుడులో మంత్రి నివాసం ఎదుట విధులు నిర్వహిస్తున్న సిఆర్‌పిఎఫ్ జవాన్ చేతికి స్వల్పగాయాలయ్యాయని చెప్పారు. స్థానిక మహిళ కూడా గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు.

ఆమోదం లేకుండా జిల్లాలు, సంస్థల పేర్లు మార్చడం నేరం : మణిపూర్ ప్రభుత్వ ప్రకటన

ఇంఫాల్ : ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలు, సంస్థల పేర్లు మార్చడం నేరమని మణిపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది. తమ ఆదేశాలను ఉల్లంఘించినట్లు వెల్లడయితే సంబంధిత చట్టాల ప్రకారం విచారణ జరుగుతుందని పేర్కొంది. 'రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా జిల్లాలు, సబ్ డివిజన్లు, స్థలాలు, సంస్థలు పేర్లను మార్చే ఉద్దేశపూర్వక చర్యలను ఎవ్వరూ చేయకూడదు లేదా ప్రయత్నించకూడదు' అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినీత్ జోషి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతిభద్రతల సంక్షోభం నెలకున్న సమయంలో కొన్ని సంస్థలు, కొంత మంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా జిల్లాల పేరు మార్చడం లేదా మార్చడానికి ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని నోటిఫికేషన్‌లో తెలిపారు.

ఏడాదికి రెండుసార్లు పరీక్షలు తప్పనిసరి కాదు

- 10, 12వ తరగతి బోర్డు పరీక్షలపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ : ఏడాదికి రెండుసార్లు 10, 12వ తరగతి బోర్డు పరీక్షలకు విద్యార్థులు హాజరుకావడం తప్పనిసరి కాదని, విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకునేందుకే ఈ ఆప్షన్‌ను ప్రవేశపెడుతున్నామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ 'ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జెఇఇ మాదిరిగానే.. 10, 12వ తరగతుల బోర్డు పరీక్షలకు కూడా సంవత్సరానికి రెండుసార్లు హాజరయ్యే అవకాశం ఉంటుంది. ఈ రెండింటిలో ఉత్తమ స్కోర్‌ను ఎంచుకోవచ్చు. ఇది పూర్తిగా ఐచ్ఛికం, తప్పనిసరికాదు' అని తెలిపారు. సంవత్సరంలో ఒకే అవకాశంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని, ఒత్తిడిని తగ్గించడానికే ఈ ఆప్షన్‌ను ప్రవేశపెట్టామని చెప్పారు.

దాడులు, ప్రతిదాడులు ఆపండి

- ఇజ్రాయిల్, హమస్ ఘర్షణలపై సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : హమాస్, ఇజ్రాయిలీ బలగాల మధ్య పాలస్తీనాలోని గాజాలో జరుగుతున్న దాడులు, ప్రతిదాడులను సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఇప్పటికే చాలామంది ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితి తీవ్రత చూస్తుంటే మరింతమంది ప్రాణాలు బలిగొనేలా, కష్టాలు కడగండ్లకు గురిచేసేలా ఉంది. కాబట్టి ఈ ఘర్షణలకు వెంటనే స్వస్తి పలకాలి. ఇజ్రాయిల్‌లోని పచ్చి మితవాద నెతన్యాహు ప్రభుత్వం పాలస్తీనాలోని భూములను విచక్షణారహితంగా ఆక్రమించి, అక్రమంగా యూదుల నివాసాలను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు అంటే ఈ ఘర్షణలకు ముందు రోజువరకు 40 మంది పిల్లలతో సహా 248 మంది పాలస్తీనా వాసులు ప్రాణాలు కోల్పోయారు. మాతృభూమికి సంబంధించి పాలస్తీనా ప్రజల చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించేలా ఐక్యరాజ్య సమితి చొరవ చూపాలి. పాలస్తీనా భూ భాగంలో ఇజ్రాయిల్ అక్రమంగా ఏర్పాటు చేసిన నివాసాలు, ఆక్రమణలను ఉపసంహరించుకోవాలి. రెండు దేశాల ఏర్పాటుకు సంబంధించి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యుఎన్ఎస్‌సి) తీర్మానాన్ని అమలు చేయాలి. ఐరాస చేసిన తీర్మానానికి అనుగుణంగా తూర్పు జెరూసలెం రాజధానిగా పాలస్తీనా ఏర్పడాలి. ఈ సంఘర్షణను తక్షణమే నిలిపివేసేలా చూసేందుకు ఐరాస, భారత ప్రభుత్వంతో సహా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. అలాగే ఐక్యరాజ్య సమితి తీర్మానం అమలుకు అవి తగు చొరవ చూపాలని సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది.

ఇజ్రాయిల్‌కు ఎయిరిండియా సర్వీసుల నిలిపివేత

న్యూఢిల్లీ : ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారత్ నుంచి రాకపోకలు సాగించే విమానాలను వారం రోజులపాటు రద్దు చేసినట్లు ఎయిర్ ఇండియా ఆదివారం ప్రకటించింది. 'ప్రయాణికులు, సిబ్బంది భద్రత దృష్ట్యా .. టెల్ అవీవ్‌కు రాకపోకలు సాగించే ఎయిర్ ఇండియా విమానాలను అక్టోబరు 14 వరకు నిలిపివేస్తున్నాం' అని ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. ఇప్పటికే టికెట్లు కన్ఫర్మ్ అయిన ప్రయాణికులకు అన్ని రకాల సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. శనివారం కూడా టెల్ అవీవ్‌కు రాకపోకలు సాగించే విమానాలను ఎయిర్ ఇండియా రద్దు చేసిన సంగతి తెలిసిందే. జర్మన్ ఎయిర్‌లైన్స్ లుఫ్తాన్సా, స్విస్ ఎయిర్, టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో పాటు పలు అంతర్జాతీయ సంస్థలు విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు, రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి.

కేంద్రం ఎందుకు కలవరపడిందో?

- 2020 ఢిల్లీ అల్లర్ల ఉత్తర్వులపై జస్టిస్ మురళీధర్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో తాను జారీ చేసిన ఉత్తర్వు కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు కలవరపరిచిందో తనకు తెలియదని ఒరిస్సా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్.మురళీధర్ అన్నారు. ఆ ఏడాది ఫిబ్రరి 26న మురళీధర్ నేతృత్వంలోని ఢిల్లీ హైకోర్టు బెంచ్ ఆ నెల ప్రారంభంలో నగరం అనుభవించిన మతపరమైన అల్లర్లపై దర్యాప్తు చేస్తున్న తీరుపై బహిరంగ కోర్టులో ఢిల్లీ పోలీసులను మందలించింది. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) మద్దతుదారులు, చట్టాన్ని వ్యతిరేకించే వారి మధ్య ఘర్షణలు చెలరేగాయి. కనీసం 53 మంది వ్యక్తులు మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. హింసలో మరణించిన వారిలో ఎక్కువ మంది ముస్లిములే కావటం గమనార్హం. ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించి బిజెపి నేతలపై 24 గంటల్లోగా ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయాలని పోలీసులను అప్పట్లో మురళీధర్ ఆదేశించారు. బెంగళూరులో ఒక న్యూస్ వెబ్‌సైట్ నిర్వహించిన ఒక కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మెలోని విధానాలపై కార్మికవర్గం కన్నెర్ర రోమ్‌లో భారీ నిరసన ర్యాలీ

రోమ్. మెలోని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఇటలీ కార్మికవర్గం కన్నెర్ర చేసింది. కార్మిక సంఘాల సమాఖ్య జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్(సిజిఐఎల్) ఇచ్చిన పిలుపునందుకుని వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. . రోమ్ లోని పియాజ్జా శాన్ జియోవన్నీ సెంటర్ ప్రదర్శకులతో కిక్కిరిసిపోయింది. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న పచ్చి మితవాద జార్జియా మెలోనీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ భారీ నిరసన ర్యాలీకి రాజకీయ పార్టీలు, శాంతి సంఘాలు, యువజన సంఘాలు వంటి 100 గ్రూపులు మద్దతు తెలిపాయి. దీనికి ఇంత పెద్ద ఎత్తున స్పందన రావడానికి రాజ్యాంగ రక్షణ, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఉద్యోగ భద్రత, మీడియా స్వేచ్ఛ వంటి విస్తృతమైన డిమాండ్లను చేపట్టడం ఒక ముఖ్య కారణమని సీజీఐఎల్ నాయకుడు మరిజియో లాండినీ చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షించాలనే డిమాండ్ అందరికీ సంబంధించినది కావటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాంతి సంఘాల కార్యకర్తలు కూడా ఈ ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. ఇటాలియన్ రాజ్యాంగం యుద్ధాన్ని బహిరంగంగా నిరసిస్తుంది. దీనికి పూర్తి విరుద్ధమైన మార్గంలో మెలోనీ ప్రభుత్వం వెళ్తోంది. శాంతిని ప్రోత్సహించటానికి, ఇటలీలో ప్రజా సేవలను బలోపేతం చేయటానికి బదులు ఆయుధాల మీద, యుద్ధం మీద ఎక్కువగా ప్రజాధనాన్ని తగలేస్తోంది. ఆరోగ్యాన్ని, విద్యను సరళీకరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోంది. దీనితో ప్రజలకు ఆహారం, ఇతర అవసర సేవలకోసం జీవన పోరాటం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ డిమాండ్ల సాధనకు అనేక వామపక్ష సంస్థలు సాధారణ సమ్మెకు పిలుపునివ్వాలని కోరాయి. పారిశ్రామిక సమ్మెతోసహా తాను ఏ చర్యను మినహాయించటంలేదనీ, ఇతర కార్మిక సంఘాలతో చర్చించి అంతిమ నిర్ణయం ప్రకటిస్తామని లాండినీ స్పష్టం చేశారు.

దాడులు అంతం కావాలి: పోప్

వాటికన్ సిటీ: ఇజ్రాయెల్ పాలస్తీనాలో శాంతి కోసం పోప్ ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. ఉగ్రవాదం, యుద్ధం పరిష్కారానికి దారితీయవు" అని వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ నుంచి ఇచ్చిన సందేశంలో పోప్ పేర్కొన్నారు. . దాడులు వెంటనే ఆపాలి. ఇజ్రాయెల్, పాలస్తీనాలో శాంతి కోసం ప్రార్థిద్దాం. దాడులు , ఆయుధాలను నిర్మూలించమని మిమ్మల్ని వేడుకుంటున్నాను. అని పోప్ తన సందేశంలో పేర్కొన్నారు.

బెంగళూరు శివారులో బాణాసంచా గోడౌన్‌లో అగ్నిప్రమాద దృశ్యం

బాణసంచా గొడౌన్‌లో అగ్ని ప్రమాదం

- 14కు పెరిగిన మృతుల సంఖ్య

బెంగళూరు : కర్ణాటక రాజధాని బెంగళూరు శివారులో శనివారం బాణాసంచా దుకాణం, గొడౌన్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకుంది. ఈ ప్రమాదంలో మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరు శివారులో అత్తిబెలెలోని గొడౌన్ వద్ద ఒక వాహనం నుంచి బాణసంచా దించుతుండగా పేలుడు సంభవించింది. 11 మంది మృతదేహాలను గుర్తించారు. అత్తిబెలెలోని ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో గుర్తు తెలియని మూడు మృతదేహాలను ఉంచారు. గాయపడిన ఏడుగురు సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజి ఆసుపత్రిలోనూ, ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారు. వీరిలో గోడౌన్ యజమాని కుమారుడు కూడా ఉన్నారు. పొగ పీల్చడం, మంటలతో తీవ్ర కాలిన గాయాలతో వీరు చికిత్స పొందుతున్నారని, వీరికి రానున్న 72 గంటలు కీలకమని వైద్యులు తెలిపారు. గొడౌన్ యజమాని రామస్వామి, అతని కుమారుడు నవీన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాద సమయంలో గోడౌన్‌లో 35 మంది కార్మికులు పని చేస్తున్నారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి శివకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడ్డ వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారుల్ని ఆదేశించారు.

మీకోసం

చెక్క పాత్రలపై పడ్డ మొండి మరకలు పోవాలంటే వెనిగర్, నీళ్లు సమపాళ్లలో తీసుకుని, ఆ మిశ్రమంలో పాత్రల్ని రాత్రంతా నానబెట్టాలి. ఉదయం పొడిబట్టతో పాత్రలను తుడిచేస్తే మరకలు పోతాయి.

జీవన సౌరభం

వేచి వుంటే అవకాశాలు వస్తాయి. అయితే అవి దూసుకుపోయే వారు వదిలివేసినవి మాత్రమే.

మా పల్లె అందాలు చూడండి ఓ మారు

గగన వీధిలో గువ్వలు గూటికి
చేరే సమయాన
పడమట సూర్యుడు సంధ్య రాగం
పాడే తరుణాన
నీలి మబ్బులు గాలికి అటు నిటు
ఊగుతున్నవోయి
మబ్బుల రాపిడి మధ్యన మెరుపులు
తళుకు మన్నవోయి
చిట పట మంటూ వాన జల్లుగా
జాలువారెనోయి
గంట మ్రోతకై బడి పిల్ల గాళ్ళు
వేచి వున్నరోయి
గణగణ మని బడి గంట మ్రోగేను
పిల్లలందరూ పరుగున సాగెను
ఆకశాన హరివిల్లు విరిసెను
ఆవుల మందలు ఇంటికి నడిచెను
మట్టి వాసనలు గుప్పున ఎగిసెను
జాబిలి అప్పుడే తొంగి చూసెను
చీకటి వెలుగులు కలిసే సమయం
పల్లె అందాలు మెరిసే తరుణం
చూడాలండి ఓ మారు
చూస్తే మరచి పోలేరు

- కూచిమంచి నాగేంద్ర
91821 27880.

లెక్క చేయండి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేయండి. ఎదురుగా ఇచ్చిన సమాధానాలను బట్టి చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ

సి. భువనలేఖ
5వ తరగతి,
వికాస్ హై స్కూల్,
సిద్దిపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆటల్లో మన ఆడపిల్లలు..

ఆడపిల్లలు ఇంట్లో నుండి కాలు బయటపెడితే తిరిగి ఇంటికి వచ్చేదాకా ఆ తల్లిదండ్రులకు కంటిమీద కునుకు ఉండదు. ఆ బిడ్డే ఆటల్లో రాణిస్తానంటే ఆ భయం ఇంకా వెంటాడుతుంది. ఒంటరిగా ఎక్కడెక్కడికో ప్రయాణించాలి. దేశం కాని దేశంలో, కుటుంబానికి దూరంగా నెలల తరబడి గడపాలి. ఇదంతా ఒక ఎత్తయితే.. మగరాయుడిలా ఆ వేషాలేంటి? ఆడపిల్లకి ఇవన్నీ ఎందుకు? పెళ్లి చేసి పంపించేయక.. అనే సూటిపోటి మాటలు ఎప్పుడూ ఉంటాయి. ఇలాంటి ఎన్నో సాదకబాధలను అనుభవిస్తున్నా తమ సత్తా ఏంటో చాటిచెబుతున్నారు మన క్రీడాకారిణిలు. తాజాగా చైనాలో నిర్వహించిన ఆసియా గేమ్స్‌లో వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా పతకాలు సాధించడం దేశానికే గర్వకారణం కాదు, ఆ కుటుంబాలకి గొప్ప ఊరట. ఆ క్రీడామణుల్లో కొంతమంది గురించి క్లుప్తంగా..

పిండినీళ్లే పాలని భ్రమించి..

పేదరికంలో పుట్టి, తినడానికి తిండి లేక పిండి నీళ్లు తాగి పెరిగింది మన వైజాగ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ. ఈ ఆసియా గేమ్స్‌లో వంద మీటర్ల హర్డిల్స్‌లో ఆమె రజతం సొంతం చేసుకుంది. అంతకుముందు పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తన సత్తా చూపించింది. ఈ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు. అనారోగ్యంతో బాధపడే తండ్రి కుటుంబపోషణ కోసం నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసే వాడు. మొదటి సంతానం కొడుకు పుడితే సంతోషపడిన ఆ కుటుంబం రెండో బిడ్డ ఆడపిల్ల పుడితే పెంచలేమని తీర్మానించుకుంది.

'కడుపులో బిడ్డ ఎవరో తెలియకపోయినా అసలు రెండో బిడ్డను పోషించే స్థోమత మాకు లేదు. అదే ఆడపిల్ల అయితే ఆ భారం మరింత అవుతుందని భయపడి అబార్షన్ చేయించుకుందామని ఆస్పత్రికి వెళ్లాను. డాక్టర్లు మందలించి ఇంటికి పంపించేశారు. మేం భయపడ్డట్టే ఆడబిడ్డ పుట్టింది. పాలు లేక గంజినీళ్లు పట్టేదాన్ని. ఒక్కోసారి ఏడుపు ఆపకపోతే పిండినీళ్లు పాలని చెప్పి తాగించేదాన్ని' అంటూ జ్యోతిని గుర్తుచేసుకుని కంటనీరు పెట్టుకుంది తల్లి కుమారి.

'ఎప్పుడూ ఆటలేనా చదువు ధ్యాస లేదా' అని అన్న మందలిస్తే ఏడుస్తూ చీకట్లో నడుచుకుంటూ వెళ్లిపోయిన కూతురును వెతికి వెతికి మరీ ఇంటికి తీసుకొచ్చిన రాత్రి, ఆ తల్లికి ఇంకా గుర్తే.. 'నేను బాగా ఆడతా.. నీకే కాదు.. దేశానికే మంచి పేరు తెస్తా' అని ఆ రోజు ఆమె అన్న మాటలు నేడు రుజువుచేస్తూ పతకాలు కురిపిస్తోంది. 'నీ పరిస్థితి ఏంటి.. ఆడపిల్లని అలా బయటికి పంపుతున్నావు. ఇదేం పద్ధతి?' అన్న వాళ్లే ఈ రోజు జ్యోతి విజయాన్ని ప్రశంసిస్తుంటే ఆమె ఆనందానికి అవధులు లేవు

బంగారు బాణం..

విజయవాడకు చెందిన జ్యోతి సురేఖ వ్యవసాయ కుటుంబం నుండి వచ్చింది. తండ్రి వెటర్నరీ డాక్టరు. తల్లి గృహిణి. తాజా పోటీల్లో ఆర్చరీ విభాగంలో వ్యక్తిగతంగా, బృందంగా పాల్గొని ఏకంగా మూడు బంగారు పతకాలు సాధించింది. బాల్యం నుండే ఆమెను క్రీడాకారిణిగా చూడాలని తల్లిదండ్రులు ఎన్నో కలలుగన్నారు. ఆ దిశగా మొదలుపెట్టిన ప్రయాణంలో సురేఖకు స్విమ్మింగ్ నేర్పించారు. నాలుగేళ్లకే కృష్ణానదిని ఆ చివర నుండి ఈ చివరికి మూడుసార్లు ఈది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న ఆమె ఈతలో రాణిస్తున్నా, బలహీనమైన కాళ్లు ఉండడం వల్ల మున్ముందు పోటీల్లో సత్తా చాటలేదని కోచ్‌లు చెప్పారు. అప్పటికే సురేఖకి 11 ఏళ్లు. బిడ్డపై పెంచుకున్న ఆశలన్నీ కరిగిపోయాయని తండ్రి సురేంద్ర ఎంతో మదనపడ్డారు. అయితే ఆ తరువాత వాళ్లు తీసుకున్న నిర్ణయం సురేఖను ఆర్చరీ వైపు అడుగులు వేసేలా చేసింది. ఆ అడుగులే నేడు ఆ ఇంటికి పతకాల వరదను తెచ్చిపెడుతున్నాయి. చిన్న వయసులోనే అర్జున అవార్డును దక్కించుకున్న ఘనత సురేఖ విజయాల జాబితాలో ఒకటి. జాతీయ, అంతర్జాతీయ వేదికలలో పాల్గొంటూ తన సత్తా చూపిస్తున్న సురేఖ ఒలింపిక్‌లో బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా దూసుకెళ్తోంది.

అమ్మ అయినా దూసుకుపోతోంది

కేరళకు చెందిన దీపిక పల్లికల్ క్రికెటర్ దినేశ్ భార్యగా ఎందరో అభిమానులకు పరిచయమే. ఆమె తల్లి కూడా భారత క్రికెటర్‌గా రాణించారు. చిన్నప్పటి నుండి క్రికెట్ చూస్తూ పెరిగిన దీపిక మాత్రం భిన్నమైన క్రీడవైపు అడుగులు వేశారు. నిర్దిష్ట వేగంతో గోడకు బంతిని విసిరికొట్టే స్క్వాష్ క్రీడను ఎంచుకున్నారు. ఆ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు. ఆ స్థాయి నుండి ప్రపంచ స్క్వాష్ క్రీడాకారుల్లో టాప్-10లో చోటు దక్కించుకునే వరకు ఎదిగారు. అంతేకాదు, క్రీడల్లో నెగ్గిన స్త్రీ, పురుషులకు సమాన పారితోషికాలు ఇవ్వాల్సిందేనని పోరాడిన ధీరత్వం ఆమె సొంతం. 2012 నుండి 2015 వరకు క్రీడల్లో పాల్గొనకుండా తన నిరసనను తెలియజేసింది కూడా. తన డిమాండ్‌కి సానుకూల ప్రకటన వచ్చిన ఏడాదే అంటే 2016లో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని విజేతగా నిలిచింది. 2021లో కవల పిల్లలకు జన్మనిచ్చిన ఈ 32 ఏళ్ల క్రీడాకారిణి పిల్లలకు ఏడాది వయసు నుండే పోటీల్లో పాల్గొంటున్నారు. క్రికెటర్‌గా భర్త తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు అతనికి కొండంత అండగా నిలబడి అతను మళ్లీ ఆటలో రాణించేలా చేశారు. కూతురుగా, భార్యగా, అమ్మగా తనను తాను నిరూపించుకుంటూనే తనకిష్టమైన రంగంలో విజేతగా నిలుస్తున్నారు.

ఆటో డ్రైవరు కూతురు

లాంగ్ జంప్‌లో రజత పతకం సాధించిన ఆన్సీ కేరళ వాసి. తండ్రి ఆటోడ్రైవర్. ఆటల్లో రాణించాలని ఆ తండ్రి చిరకాల కల. ఒలింపియన్ క్రీడాకారుడు రామచంద్రన్ క్లాస్‌మేట్‌గా ఎన్నో ఆశలున్నా కుటుంబ పరిస్థితులు సహకరించక ఆటోడ్రైవర్‌గా స్థిరపడ్డాడు. అందుకే తన కలను కూతురు ద్వారా సాకారం చేసుకోవాలని పరితపించాడు. అందుకే తండ్రి కల నెరవేర్చడమే లక్ష్యమంటున్న ఆన్సీ ఎన్నో పతకాలు సాధిస్తూ ముందుకు వెళుతోంది. తొలిసారి ఆసియా క్రీడల్లో పాల్గొని పతకం సొంతం చేసుకున్న క్షణాన, 'మనకు ఎదురుగా నిర్దిష్ట లక్ష్యం పెట్టుకున్నప్పుడు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి. అప్పుడే ఆశించిన ఫలితం వస్తుంది' అంటోంది.

72 ఏళ్ల కల సాకారమైన వేళ



మీరట్‌కు చెందిన కిరణ్ బలియాన్ షాట్‌పుట్‌లో కాంస్యం నెగ్గి, ఈ విభాగంలో పతకం కోసం ఎదురుచూస్తున్న భారత్ 72 ఏళ్ల కలను సాకారం చేసింది. హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తండ్రి గత శుక్రవారం కిరణ్ ఆడిన మ్యాచ్‌ను చూడనైనా చూడలేదు. విధుల్లో ఉన్నారు. విషయం తెలిసిన ఆ తండ్రి సంతోషంతో ఉబ్బితబ్బిబవుతూ వాహనచోదకులకు, పాదచారులకు లడ్డూలు పంచిపెట్టారు. 'నా జీవితంలో ఎక్కువ భాగం ట్రాఫిక్‌ను క్రమబద్ధకరించడానికే వెచ్చించాను. నేనొక సాధారణ వ్యక్తిని. రోడ్డుపైనే జీవితం గడిపే నాలాంటి వ్యక్తిని ఈ రోజు నా కూతురు గర్వపడేలా చేసింది' అంటూ ఆ తండ్రి చెబుతున్నప్పుడు కళ్లవెంట ఆనందభాష్పాలు రాలాయి.

ఇలా ఈ పోటీల్లో పాల్గొన్న మహిళా క్రీడాకారిణులందరిదీ ఒక్కో కథ. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో, మరెన్నో సవాళ్లతో బరిలో దిగి, తల్లిదండ్రులను, కుటుంబాన్ని, దేశాన్ని గర్వపడేలా చేస్తున్న వారందరినీ మనసారా అభినందిద్దాం. మున్ముందు మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం.

రీ ఎంట్రీలో సినీతారలు

సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరు కనిపిస్తారో...ఎప్పుడు మాయమవుతారో తెలియదు. వెండితెరపై ఒకప్పుడు తమ అందం, అభినయంతో ప్రేక్షకులను ఓలలాడించిన నటీనటులు ఆ తర్వాత కాలంలో కనిపించకపోవటం తెలిసిందే. ఇలాంటి వారిలో హీరోయిన్లే ఎక్కువమంది ఉంటారు. ఇక పెళ్ళిళ్లు, కుటుంబ బాధ్యతలు, వ్యాపారాలు, ఇతరత్రా వ్యవహారాల్లో ఉంటూ ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న వారు కూడా ఉంటున్నారు. అయితే కొన్నాళ్ల తర్వాత నటనపై తమకున్న ఆసక్తితోగానీ, సినిమాల్లో వచ్చిన అవకాశాలతో గానీ సెకండ్ ఇన్నింగ్స్‌లో తమ ప్రతిభను నిరూపించుకునేందు సిద్ధమవుతున్న తారలూ టాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకూ కన్పిస్తున్నారు. ఇలాంటి వారిలో సీనియర్ హీరోయిన్లు భూమిక, జెనీలియ, స్నేహ, లైలా, సదా క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటిస్తున్న విషయం తెలిసిందే.

కీర్తిరెడ్డి : పవన్‌కళ్యాణ్ నటించిన 'తొలిప్రేమ' చిత్రంలో అను పాత్రధారిగా కీర్తిరెడ్డి నటించారు. గన్ షాట్, ప్రేమించే మనసు, రావోయి చందమామ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. మహేష్ నటించిన 'అర్జున్'లో మీనాక్షిగా మహేష్‌కు సోదరి పాత్ర పోషించారు. అయితే ఈ చిత్రాలన్నీ నిరాశే మిగల్చటంతో ఇండస్ట్రీకి దూరమయ్యారు. కీర్తిరెడ్డి సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించాలని భావిస్తున్నట్లు సమాచారం.

లయ : విజయవాడకు చెందిన లయ దాదాపుగా 35 సినిమాల్లో నటించారు. వీటిలో తెలుగుతోపాటు మలయాళం, కన్నడ, తమిళ సినిమాలు ఉన్నాయి. 'భద్రం కొడుకో'లో బాలనటిగా నటించారు. స్వయంవరం సినిమాతో తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆమె ఉత్తమ నటిగా మనోహరం (2000), ప్రేమించు(2001) చిత్రాలకు వరుసగా రెండు నంది అవార్డులను గెలుచుకున్నారు. సినిమాల్లో బాగా నటిస్తున్న సమయంలోనే ఆమె అమెరికాకు చెందిన ఓ డాక్టర్‌ని పెళ్లి చేసుకున్నారు.

ప్రియమణి : 2007లో పరుత్తివీరన్‌లో నటనకు జాతీయ ఉత్తమ నటి అవార్డు పొందిన ప్రియమణి 'ఎవరే అతగాడు' సినిమాతో టాలీవుడ్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జూనియర్ ఎన్టీఆర్‌తో కలిసి నటించిన యమదొంగ బాగా హిట్ అయ్యింది. తెలుగులోనే కాదు తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తాజాగా షారూక్‌ఖాన్ నటించిన 'జవాన్' సినిమాలోనూ నటించారు. తెలుగులోనే కాకుండా తమిళ్, కన్నడ, హిందీ, మలయాళం సినిమాల్లోనూ నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సినిమాలు, వెబ్‌సిరీస్‌లతోపాటు టీవీ షోల్లోనూ నటిస్తూ బిజీగా ఉంటున్నారు. మలయాళంలో మోహన్‌లాల్ 'నెరు' సినిమాలో ప్రియమణి నటిస్తున్నారు.

స్నేహ : ఒకప్పటి తెలుగు నటి స్నేహ ఎంతోమంది స్టార్ హీరోల సినిమాల్లో నటించారు. స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. తొలివలపు సినిమాతో తెలుగు సినీ ఇండ్రస్టీకి పరిచయమయ్యారు. ప్రియమైన నీకు, శ్రీరామదాసు, సంక్రాంతి, సన్నాఫ్ సత్యమూర్తి వంటి సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తమిళ, మలయాళ బాషల్లోనూ నటించారు. నటుడు ప్రసన్నను పెళ్లి చేసుకున్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఇప్పటికే పలు సినిమాలు చేశారు. మరికొన్ని అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు.

సదా : 2002లో వచ్చిన జయం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న సదా. ఆమె కథనాయికగా పరిచయం అయిన సినిమా కూడా అదే. ఈ సినిమాలో నటకు ఆమెకు ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డును సైతం అందుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ బాషల్లో నటించిన ప్రేక్షకులను అలరించారు. ఒక హిందీ సినిమాలో నటించిన సదా కొన్ని మలయాళ సినిమాల్లో అతిథి పాత్రలను పోషించారు. డీజె టిల్లు మూవీ సీక్వెల్ టీజె టిల్లు మూవీలో సదాను ఒక కీలక పాత్రకు ఎంపిక చేసినట్లుగా సమాచారం.

భావన : 2008లో హీరో గోపీచంద్ నటించిన 'ఒంటరి' అనే చిత్రం ద్వారా తెలుగు సినిమారే హీరోయిన్‌గా పరిచయమైన మలయాళ బ్యూటీ 'భావన'. వరుసగా నితిన్, శ్రీకాంత్, రవితేజ తదితర స్టార్ హీరోల సరసన నటించి ప్రేక్షకులని బాగానే అలరించింది. 2018లో కన్నడ సినిమా పరిశ్రమకు చెందిన నిర్మాత 'నవీన్'ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం తర్వాత మళ్లీ సినిమాల్లో నటిస్తున్నారు. రవితేజ సినిమాలో అవకాశం దొరికినట్లుగా సమాచారం.



లైలా : ఎగిరే పావురమా సినిమాతో ఆకట్టుకున్న నటి లైలా. అనతికాలంలోనే స్టార్ హీరోలతో నటించింది. ఆపై తమిళంలోనూ అడుగుపెట్టింది. విక్రమ్, సూర్య లాంటి నటులతో నటించి పేరుతెచ్చుకుంది. ఆపై పెళ్లి చేసుకుని వైవాహిక జీవితంలో స్థిరపడింది. తొమ్మిదేళ్ల తర్వాత దర్శకుడు బాలా తన కొత్త చిత్రంలో కీలకపాత్రలో నటించాలంటూ సందేశం పంపారట. ప్రస్తుతం శబ్దం అనే సినిమాలో లీడ్ రోల్ చేస్తున్నారు. ఈ పాత్ర రావడం కోసం అనేక టీవీ షోల్లో కనిపించింది.

ఆట ముగిసింది.. స్ఫూర్తి నిలిచింది!

- ఆకట్టుకున్న హాంగ్జౌ ఆసియా క్రీడల ముగింపు వేడుకలు
- భారత బృందం పతాకధారిగా హాకీ స్టార్ శ్రీజేష్

హాంగ్జౌ : 19వ ఆసియా క్రీడలు ముగిశాయి. హాంగ్జౌ ఒలింపిక్ సెంటర్‌లో క్రీడా జ్యోతి ఆరినా.. భవిత కోసం అందరం కలిసికట్టుగా నడుద్దాం అనే స్ఫూర్తి మాత్రం ఆసియా మనసు నిండా నిలిచింది. ఆదివారం హాంగ్జౌ ప్రధాన స్టేడియంలో ముగింపు వేడుకలు ఆకట్టుకున్నాయి. మరోసారి డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ పరిజ్ఞానం చాటిన చైనా.. ముగింపు వేడుకలను సైతం గుర్తుండిపోయే రీతిలో నిర్వహించింది. ఆసియా క్రీడల పతాకాన్ని హాంగ్జౌ క్రీడల ఆతిథ్య దేశం చైనా నుంచి 2026 ఆసియా క్రీడల ఆతిథ్య దేశం జపాన్ అందుకుంది. ఈ సందర్భంగా ఫ్లాగ్ అందుకునే వేడుకలో జపాన్ నృత్యకారులు కండ్లుచెదిరే ప్రదర్శన చేశారు. 19వ ఆసియా క్రీడలు ముగిసినట్టు ఆసియా ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు రణధీర్ సింగ్ అధికారికంగా ప్రకటించారు. 'ఆసియా క్రీడలకు చైనా సరైన ఆతిథ్య వేదిక. ఆసియా ఒలింపిక్ కమిటీ ఈ ఆతిథ్యం, క్రీడలను ఎప్పటికీ మరువలేదు. మన అందరిని ఏకం చేసే శక్తి క్రీడలు, ఆసియా క్రీడలకు ఉన్నాయి. హాంగ్జౌలో ఆసియా క్రీడల జ్యోతి త్వరలోనే ఆరిపోవచ్చు కానీ ఇక్కడ అందించిన స్ఫూర్తి మాత్రం ఆసియా క్రీడల చరిత్రలో ఎప్పటికీ నిలిచే ఉంటుంది. 19వ ఆసియా క్రీడలు ముగిసినట్టుగా ప్రకటిస్తున్నాను' అని రాజ రణధీర్ సింగ్ అన్నారు. ఆతిథ్య చైనా 383 మెడల్స్‌తో (201 పసిడి, 111 సిల్వర్, 71 బ్రాంజ్) అగ్రస్థానంలో నిలువగా.. జపాన్ (188), దక్షిణ కొరియా (190) టాప్-3లో నిలిచాయి. భారత్ 28 పసిడి,38 రజతాలు, 41 కాంస్యాలతో 107 మెడల్స్ సొంతం చేసుకుని ఆసియా క్రీడల చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. పతకాల పట్టికలో నాల్గో స్థానంలో హాంగ్జౌ ఆసియా క్రీడలను ఘనంగా ముగించింది.

శ్రీజేష్ జయహో.. : ముగింపు వేడుకల్లో భారత బృందానికి హాకీ ఇండియా మాజీ కెప్టెన్, వెటరన్ గోల్‌కీపర్ పి.ఆర్ శ్రీజేష్ వ్యవహరించారు. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత మెన్స్ హాకీ జట్టు పసిడి పతకం సాధించిన సంగతి తెలిసిందే. గోల్డ్ మెడల్ సాధించటంతో పాటు 2024 పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల ముగింపు వేడుకల్లో జాతీయ పతాకధారిగా నిలువటం ఎంతో గర్వకారణమి శ్రీజేష్ తెలిపాడు.

నేడు డచ్‌తో కివీస్ ఢీ

- వరుస మ్యాచ్‌లకు సిద్ధమైన ఉప్పల్ స్టేడియం

హైదరాబాద్ : డిఫెండింగ్ చాంపియన్‌ను ఆరంభ మ్యాచ్‌లో చిత్తుగా ఓడించిన జట్టు ఓ వైపు.. అర్హత టోర్నీలో రాణించి ప్రపంచకప్‌కు చేరుకున్న పసికూన మరోవైపు. ఉప్పల్ స్టేడియం ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో వరుస మ్యాచుల ధమాకాకు సిద్ధమైంది. 2015, 2019 ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్‌తో పసికూన నెదర్లాండ్స్ నేడు తలపడనుంది. నేడు మధ్యాహ్నం 2 గంటలకు కివీస్, డచ్ పోరు ఆరంభం కానుంది.

కివీస్‌కు ఎదురుందా? : ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఏకపక్ష విజయం సాధించింది. బలమైన ఇంగ్లాండ్‌ను చిత్తుగా ఓడించింది. ఆ జట్టు టాప్ ఆర్డర్ బ్యాటర్లు డెవాన్, రచిన్ రవీంద్రలు ఆకాశమే హద్దుగా చెలరేగారు. కెప్టెన్ కేన్ విలియమ్సన్ అందుబాటులో లేకపోయినా.. న్యూజిలాండ్ అదరగొట్టింది. నేడు నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌కు కేన్ విలియమ్సన్ అందుబాటులోకి వస్తే డచ్ జట్టు కష్టాలు రెట్టింపు కానున్నాయి. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో న్యూజిలాండ్ బలంగా ఉంది. హైదరాబాద్ పిచ్, పరిస్థితులపై విలియమ్సన్ సహా కివీస్ ఆటగాళ్లకు సైతం మంచి అవగాహన ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రాంఛైజీకి సారథ్యం వహించిన కేన్ విలియమ్సన్ ఉప్పల్ స్టేడియాన్ని రెండో సొంత మైదానం చేసుకున్నాడు. నేడు హైదరాబాద్ అభిమానుల నడుమ కేన్ విలియమ్సన్ చెలరేగేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక నెదర్లాండ్స్ సైతం మరీ తీసికట్టుగా ఆడటం లేదు. తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై డచ్ ఆటగాళ్లు గొప్పగా ఆడారు. ఆరంభంలో, చివర్లో పాకిస్థాన్ బ్యాటర్లను చెక్ పెట్టారు. మిడిల్ ఓవర్లలో పార్ట్ టైమ్ బౌలర్లు డచ్‌ను కాస్త వెనుకంజలో నిలుపుతున్నారు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లోనూ అదే స్ఫూర్తితో మెరిసేందుకు నెదర్లాండ్స్ సిద్ధమవుతోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68